

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 85 | ది.30-5-2025 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## కడప నుంచి నేరుగా ఢిల్లీకి బయల్దేరుతున్న చంద్రబాబు

**అమరావతి, మే 29 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని ముగించు కుని, వరుస కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. మూడు రోజుల మహానాడు ఈరోజు ముగియనుంది. అనంతరం, ఈ రోజు సాయంత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు కడప నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రేపు ఢిల్లీలోని తాజ్ హొటల్‌లో జరగనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక సర్వసభ్య సమావేశానికి (ఏజీఎం) చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ సమావేశం సాయంత్రం 4:30 గంటల నుంచి 5:30 గంటల మధ్య జరగనుంది. రేపు రాత్రి ఆయన ఢిల్లీలోనే బస చేస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమా నంలో బయలుదేరి, నేరుగా రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు.

# ఇటుకా...ఇటుకా పేర్చి రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం

- ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్
- ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ తో ఆర్థిక ఉగ్రవాదులను ఏరిపారేస్తాం
- వేలకోట్ల ప్రజా సంపద దోచేసి ప్యాలెస్ల నుంచి ఎస్టేట్లకు ఎదిగారు
- కడప టీడీపీ అడ్డా అని మహానాడుతో నిరూపించాం
- ఆదరించిన జనం రుణం తీర్చుకుంటాం..
- రాయలసీమ అభివృద్ధికి బ్లూప్రింట్
- అన్నమయ్య ప్రాజెక్ట్ తిరిగి నిర్మిస్తాం
- జూన్ 12లోపు కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తాం
- కడపకు నీళ్లు అందించేందుకు గాలేరు-నగరికి రూ.1,000 కోట్లు
- గండికోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మహానాడు తీర్మానించిన ఆరు శాసనాలు తెలుగు జాతి అభివృద్ధికి మార్గాలు
- శభాస్ కడప...మహానాడు సూపర్ హిట్
- కార్యకర్తల త్యాగం, పోరాటాల ఫలితమే ఈ ప్రజాపాలన
- జనసంద్రమైన కడప మహానాడు - పసుపు పండుగలా ముగింపు సభ

## మహానాడు బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు

**కడప, మే 29 (వార్తాప్రభ) :** పాక్ ఉగ్రవాదులను ఏరిపారేసిన ఆపరేషన్ సింధూర్ స్ఫూర్తితో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్... పాజిటివ్, ప్రోగ్రసివ్ పాలిటిక్స్‌కు నాంది పలుకుదామని... టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప మహానాడు వేదికగా పిలుపునిచ్చారు. టెర్రరిస్టులు దేశానికి ఎంత ప్రమాదమో....రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులు సమాజానికి అంతకంటే ప్రమాదకరమని.. వారిని రాష్ట్రం నుంచి తరమికొడదామన్నారు. భారతదేశం టెర్రిస్టులపై ఆపరేషన్ సింధూర్ చేసినట్లుగానే... ఆర్థిక ఉగ్రవాదులను 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్'తో రాజకీయల్లో లేకుండా చేద్దామన్నారు. రాజకీయాలు అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో ల్యాండ్, సాండ్, వైన్, మైన్ వంటి స్కాంలతో రాష్ట్రాన్ని దోచేశారని అన్నారు. నాడు నమ్మి ఓటేస్తే జె బ్రాండ్స్‌తో, గంజాయి, డ్రగ్స్‌తో ప్రజల ఆరోగ్యాలు పాడుచేశారని చెప్పారు. అడవులు ఆక్రమించి ఎస్టేట్ లు నిర్మించుకున్నారని... కొండలు-చెరువులు కూడా మింగేశారని విమర్శించారు. ప్యాలెస్‌ల నుంచి ఎస్టేట్‌ల వరకు అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారని... అహంకారంతో విర్రవీగిన వైసీపీకి బుద్ధిచెప్పారని చంద్రబాబు అన్నారు. పార్టీ ఎలా ఉండాలో, పాలన ఎలా ఉండాలో చెప్పడంలో టీడీపీ ప్రస్థానం ఒక ఒక కేస్ స్టడీగా.. పాలకులు ఎలా ఉండకూడదో, పార్టీ ఎలా నడపకూడదో వైసీపీ ఒక కేస్ స్టడీగా పేర్కొన్నారు. గురువారం కడప శివార్లలో మహానాడు 3వ రోజు నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామన్న చంద్రబాబు... టీడీపీ కార్యకర్తల త్యాగం, పోరాటాల ఫలితంగానే ఈ ప్రజాపాలన వచ్చిందన్నారు.

**మహానాడు సూపర్ హిట్..** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు..దేవుని గడపలో జరిగింది. రెస్పాన్స్ అదిరింది. సూపర్ హిట్ అయ్యింది. ఇక్కడ మీకొక విషయం గుర్తు చేయాలి. గత ఏడాది మే 2వ తేదీన ప్రజాగళం ఎన్నికల సభ కోసం నేను కడపకు వచ్చాను. ఆ రోజు సభలో "కడప రాజకీయం మారుతోంది. కడప గడపలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నాను. ఆ మాట అక్షరాలా నిజమైంది. ఆ ఎన్నికల్లో కడపలోనే కాదు...రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో అద్భుత విజయం సాధించాం. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న 10 సీట్లల్లో 7 సీట్లు కూటమి గెలుచుకుంది. ఈ సారి ఇంకొంచెం ఫోకస్ పెట్టి 2029 ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలిచేందుకు సిద్ధమా తమ్ముళ్లూ, ఆడబిడ్డలూ అని అడుగుతున్నాను. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు... 52 స్థానాలకు 45 స్థానాల్లో కూటమిని





గెలిపించారు. ఇందులో టీడీపీనే 40 సీట్లు గెలిచింది. వైసీపికి సీమ జిల్లాల్లో 7 స్థానాలొస్తే, కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే 7 స్థానాలు వచ్చాయి. ప్రజాతీర్పు మనకు బాధ్యత గుర్తు చేసింది. వైసీపీ ఓటమిని ఇప్పటికీ అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోదు కూడా. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదు....ప్రజల జీవితాలు మార్చాలనేదే మన సిద్ధాంతం.

**ప్రజా తిరుగుబాటుతో తిరుగులేని విజయం..** తెలుగు దేశం పార్టీకి ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, ఎన్నికలు, గెలుపు కొత్త కాదు. గత ప్రభుత్వంపై 5 ఏళ్లు మనం పోరాటాలు చేశాం. హింసా రాజకీయాలు, హత్యలు, కేసులు, అవమానాలు, అవహేళనలు, బూతులు అణిచివేతను కార్యకర్తలు ఎదుర్కొన్నారు. మీరే నా బలం, బలగం. ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని... టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు అసాధారణ విజయంతో ఆశీర్వదించారు. 93 శాతం స్ట్రయిక్ రేట్, 57 శాతం ఓట్ షేర్ , అదిరిపోయే మెజారిటీలు ఇచ్చారు. ఒకప్పుడు అసెంబ్లీకి 10 వేలు...15 వేలు మెజారిటీలు వస్తే మంచి మెజారిటీలు అనుకునేవాళ్లం. కానీ మొన్నటి ఎన్నికల్లో 83 మందికి 30 వేలుపైన, 30 మందికి 50 వేలుపైన, 10 మందికి 70 వేలుపైన, ముగ్గురికి 90 వేలుపైన మెజారిటీలు వచ్చాయి. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, భీమిలిలో గంటా శ్రీనివాస రావు, మంగళగిరిలో నారా లోకేష్‌కి 90 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. (%ఖ్షష్ట్రఎ అశీ%) వైనాట్లు, గొడ్డలి పోట్లు అనేది మన రాజకీయం కాదు... ప్రజలిచ్చిన అధికారాన్ని బాధ్యతలా భావించి ప్రతి క్షణం కష్టపడి పనిచేయడం మన విధానం....ఏడాదిగా అదే చేస్తున్నాం.

**గత ప్రభుత్వంలో ఐదేళ్లూ అంధకారమే..** సరిగ్గా ఏడాది క్రితం...రాష్ట్రం చిమ్మచీకట్లో, అస్థవ్యస్థ పరిస్థితుల్లో ఉంది. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు పెట్టారు. రూ.1.20 లక్షల కోట్ల బకాయిలు పెట్టారు. అప్పులకు ఏడాదికి కట్టాల్సిన వడ్డీనే రూ. 40 వేల కోట్లు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు లేని పరిస్థితి నాడు ఉంది. అయితే కష్టాలను చూసి బెదిరిపోలేదు... సవాళ్లను చూసి పారిపోలేదు... అనుభవంతో ఆలోచించాను. క్లైమోర్ మైన్స్‌కే భయపడని నేను సమస్యలకు భయపడతానా? మనో ధైర్యంతో ముందుకు పోయాం. సంకల్పంతో ఒక్కో ఇటుకా పేర్చుతూ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మించే యజ్ఞం చేస్తున్నాం. ఏడాదిలోపే ఎన్నో సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలతో సుపరిపాలన అంటే ఏంటో చూపించాం.

**అందరికీ సంక్షేమమే ధ్యేయం..** అభివృద్ధి-సంక్షేమం-సంపద సృష్టి నిరంతరం చేస్తూ... మెరుగైన జీవన ప్రమాణాలు అందించే విధానంతో అడుగులు వేస్తున్నాం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ. సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్. నన్ను నమ్ముకున్న జనం కోసం ఎంతైనా కష్టపడతాను. కోడూరు నుంచి 60 ఏళ్ల వయసులో సైకిల్‌పై ఓ కార్యకర్త కడప మహానాడుకు వచ్చాడంటే అదీ అభిమానం. ఇంతటి అభిమానం

- 8లో

# ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు యోగాంధ్ర

- జూన్ 21 వరకు ఊరూవాడా పండగలా యోగా కార్యక్రమాలు
- 26 జిల్లాల్లోనూ 26 ఇతివృత్తాలతో థీమ్ యోగా నిర్వహణ
- అన్ని వర్గాల ప్రజలకూ యోగాను చేరువచేసేందుకు కృషిచేస్తున్నాం
- కనీసం రెండు కోట్లమందికి యోగాసనాలు నేర్పడం లక్ష్యంగా కార్యక్రమాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్ల నమోదు
- విజయవాడ బీఆర్‌టీఎస్ యోగాంధ్ర స్ట్రీట్‌లో విజయవంతంగా పోలీస్ యోగాంధ్ర
- ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా ముందడుగేద్దాం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్







**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా మే 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం ముందుకెళ్తోందని, ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా అడుగులేద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పోలీస్ కమిషనరేట్, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీసు థీమ్ యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొని సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సంతోషకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని, అప్పటికి కనీసం రెండుకోట్ల మందికి యోగాను నేర్పించేలా ప్రణాళిక ప్రకారం కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్లు నమోదు చేసుకున్నారని, వీరి సహాయంతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలు నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. థీమ్ యోగాంధ్రలో భాగంగా గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం విజయవంతమైందని.. ఇదే స్ఫూర్తితో యోగాంధ్ర విజయవంతానికి కృషిచేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్రకు విశేష స్పందన: ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు..** ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన యోగాంధ్రకు విశేష స్పందన లభిస్తోందని.. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములవుతూ యోగా ఔన్నత్యానికి వన్నె తెస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ యోగాభిలాషులు నమోదు చేసుకుంటున్నారని, కొన్ని జిల్లాల్లో లక్ష్యానికి మించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించారు. భూ పరిపాలన చీఫ్ కమిషనర్, ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అందించిన విలువైన యోగా సంపదపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకొని, రోజువారీ జీవితంలో యోగాతో అనుసంధానమై సుసంపన్న జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. యోగాచరణను ఏ ఒక్క రోజుకో పరిమితం చేసుకోకుండా జీవితాంతం ఓ మంచి అలవాటుగా కొనసాగించాన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ యోగాసనాల కార్యక్రమాలు జరుగుతున్నాయని, బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లోనూ థీమ్ యోగాను నిర్వహిస్తున్నామని, ఇప్పటికే పాత్రికేయులు, యోగా శిక్షణ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వాహన చోదకులు తదితరులతో థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాలో భాగంగా గాంధీ హిల్‌పై యోగాసనాల అభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మిగిలిన పర్యాటక ప్రాంతాల్లోనూ నిర్వహిస్తామని.. ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను చేరువచేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ సొంతం చేసే యోగా ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆచరించేలా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రలో పోలీసు శాఖ భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గురువారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో దాదాపు అయిదువేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులతో నిర్వహించిన పోలీసు యోగాంధ్ర విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

**కనులవిందుగా కళాత్మక యోగా:** కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓం శాంతి బ్రహ్మకుమారీలు యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు.

# విధ్వంస పాలనతో అన్నపూర్ణను అప్పులప్రదేశ్ గా మార్చేశారు!

## కడప మహానాడు వేదికపై యువనేత నారా లోకేష్ సింహగర్జన

- మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు
- ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడే పసుపుసైన్యమే మనబలం
- తెలుగుజాతిని ప్రపంచపటంలో నిలిపిన సిబిఎన్ బ్రాండ్
- తెలుగుప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్న ఎన్టీఆర్
- ఏడాదిలోనే రూ.8.5లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- ప్రభుత్వ కొనసాగింపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- రెడ్ బుక్ కాదు, రెడ్ కలర్ చూసినా వాళ్లకు నిద్ర పట్టడం లేదు



**కడప,మే 29 (వార్తాప్రభ) :** వైసిపి విధ్వంస పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది, దేశానికే అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ ను అప్పులప్రదేశ్ గా మార్చేశారు, ఒక్క కొత్త కంపెనీ రాకపోగా ఉన్న కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోయాయి, అంతులేని ధనదాహంతో విషం కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఏరులై పారించి 30వేలమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు, వేలకోట్లు దోచుకొని రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వెళ్లిపోయారని టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడప మహానాడు వేదికపైనుంచి లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలనుద్దేశించి యువనేత లోకేష్ మాట్లాడుతూ... మనకి అధికారం కొత్త కాదు , ప్రతిపక్షం కొత్త కాదు. కానీ 2019 నుండి 2024 వరకూ విధ్వంస పాలన ఎదుర్కొన్నాం. ప్రశ్నిస్తే కేసులు, పోరాడితే అరెస్ట్. మన అధినేతను అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. నాయకులు, కార్యకర్తల పై వేల కేసులు, అరెస్టులు జరిగాయి. నాయకులు, కార్యకర్తల పై దాడులు చేసారు, హత్యలు చేసారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రత్యర్థులు దాడి చేస్తున్నా మీసం మెలేసి తొడకొట్టిన అంజిరెడ్డి తాత మన దమ్ము. గొడ్డలితో దాడి చేసినా, కత్తులదాడిచేసి తల నుండి రక్తం కారుతున్నా ఈవిఎం మెషిన్కు సీల్ వేసే వరకూ పోలింగ్ బూత్ లో కూర్చున్న మంజులా రెడ్డి మన ధైర్యం. కత్తి మెడ పై పెట్టి వాళ్ళ నాయకుడి కి జై కొట్టమంటే జై చంద్రబాబు జై టిడిపి అన్న చంద్రయ్య మన స్ఫూర్తి. అరాచకులపై పోరాడి కంటిచూపు కోల్పోయిన చెన్నుపాటి గాంధీనే మనకు ప్రేరణ. ప్రాణాలను ఫణంగా పోరాడే పసుపు సైన్యమే మనబలం.

**కడప మాస్ జాతర అదిరిపోయింది!** తిరుమల తొలిగడప దేవుని కడప... ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం... చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ..

- 7లో

# థాంక్యూ మోదీ జీ

## రూ.3653 కోట్ల తో బద్వేల్-నెల్లూరు హైవేకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- పట్నా విమానాశ్రయ ప్రారంభోత్సవ సందర్భంలో మోదీకి జాతీయ రహదారి మంజూరు పై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు
- మహానాడులో ఆపరేషన్ సింధూర పై టీడీపీ తీసుకున్న రాజకీయ తీర్మానం పై ప్రధానికి సమాచారం అందజేత.



**పాట్నా,మే 29 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ మౌలిక వృద్ధికి కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బద్వేల్ నుండి గురువిందపూడి వరకు 4 లేన్ల హైవే నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం ?3653 కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు, రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి తోడ్పాటు అందించేలా జాతీయ రహదారిని నిర్మించనున్నారు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, బుధవారం పాట్నాలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై ఈ ఆమోదానికి కృతజ్ఞతలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల ప్రధానమంత్రికి ఉన్న నిబద్ధతను ఈ నిర్ణయం స్పష్టంగా చూపిస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు మన రాష్ట్రానికి చేర్చేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు ఇది పెద్ద ఉదాహరణ" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ హైవే కారిడార్ NH-67 (బద్వేల్) నుండి NH-16 (గురువిందపూడి) వరకు 108 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. కృష్ణపట్నం పోర్ట్‌కు ప్రయాణ దూరాన్ని సగానికి తగ్గించే ఈ మార్గం, రాష్ట్రంలోని మూడు ప్రధాన పారిశ్రామిక కారిడార్లను కలుపుతుందని అధికారులు తెలిపారు. 43 లక్షల మానవ-దినాల ఉపాధిని ఈ ప్రాజెక్టు కలిగించనున్నట్లు అంచనా.

**మహానాడు తీర్మానంపై ప్రధానికి నివేదిక :** మరోవైపు, మే 27న జరిగిన టిడిపి మహానాడు సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన రాజకీయ తీర్మానాన్ని కూడా మంత్రి రామ్మోహన్ ప్రధానమంత్రికి తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానం ద్వారా టిడిపి 'ఆపరేషన్ సింధూర్'కు పూర్తి మద్దతును ప్రకటించింది. "దేశాన్ని రక్షించే సైన్యం పట్ల మేము నిలబడతాం. ప్రధానమంత్రి మోదీ నాయకత్వాన్ని టిడిపి సంపూర్ణంగా మద్దతిస్తున్నది" అంటూ ఈ తీర్మానాన్ని మహానాడులో ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి, మంగళవారం పాట్నాలో ప్రధానికి అధికారికంగా తెలియజేశారు.

## కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే పశుసంవర్ధకశాఖ బదిలీలు జరపండి - గెజిటెడ్ అధికారుల జేఏసీ వినతి



**అమరావతి,మే 29 (వార్తాప్రభ) :** పశు సంవర్ధకశాఖ బదిలీల్లో అవకతవకలు కొనసాగుతున్నాయని, తక్షణమే కౌన్సెలింగ్ పద్ధతి ద్వారా బదిలీల ప్రక్రియను నిర్వహించాలని పశు సంవర్ధకశాఖ గెజిటెడ్ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు జేఏసీ చైర్మన్ సిహెచ్.ఎస్.కృష్ణారావు, కోచైర్మన్లు డాక్టర్ గణేశ్వరరావు, జి.రవిబాబు, న్యాయ సలహాదారు బోడపాటి సుధీర్‌కుమార్ తదితరులు కలిసి విన్నవించారు. పూర్తి స్థాయిలో కొనసాగుతున్న రాజకీయ బదిలీలపై ప్రభుత్వ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలన్నారు. కౌన్సిలింగ్ పద్ధతి ద్వారా బదిలీల ప్రక్రియ జరిగితేనే పారాదర్శకత ఉంటుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై బుడితి రాజశేఖర్ స్పందిస్తూ, ఆ శాఖ సంచాలకులు దామోదర నాయుడుతో మాట్లాడి, పూర్తి స్థాయిలో పారదర్శకంగా బదిలీలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు.

## గోదావరి ఒలంపియాడ్ లో సత్తా చాటిన రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు



**కోదూరు,మే 29 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా కోదూరు లోని రవితేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు గత డిసెంబర్ నెలలో గోదావరి ఒలంపియాడ్ గోదావరి ప్రెస్ క్లబ్ రాజమండ్రి వారు సంయుక్తంగా నిర్వహించిన గోదావరి టాలెంట్ టెస్ట్ లో పలు సబ్జెక్టులలో మంచి ఫలితాలు రాష్ట్రస్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ సాధించారని పాఠశాల డైరెక్టర్ వల్లభనేనివరప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సీనియర్స్ విభాగం నుండి పదవ తరగతి విద్యార్థులు కైతేపల్లి మదన్ పాల్ రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు కేశన శివ భార్గవ్ రాష్ట్రస్థాయిలో పదవ ర్యాంకు పెందుర్తి అభిలాష్ రాష్ట్రస్థాయిలో పదవ ర్యాంకు కొప్పనాతి గణేష్ ఫణి కుమార్ రాష్ట్రస్థాయిలో పదో ర్యాంకు సాధించారన్నారు. జిల్లా స్థాయిలో కొరివి శృతి సాత్విక్ పదవ తరగతి హిందీ విభాగంలో ప్రథమ స్థానం కొరివి కృతి కార్తీక్ ఏడో తరగతి విద్యార్థి హిందీ విభాగంలో కృష్ణా జిల్లాలో మొదటి స్థానం సాధించారన్నారు అలాగే మ్యాథమెటిక్స్ సైన్స్ విభాగాలలో తిరుమల శెట్టి అనుప్రియ తొమ్మిదవ తరగతి విద్యార్థిని వలపుల గ్రేస్ 9వ తరగతి విద్యార్థిని కృష్ణాజిల్లాలో మొదటి స్థానం సాధించారన్నారు. అలాగే జూనియర్స్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థులు అప్పికట్ల రాఘవేంద్ర తిరుమల శెట్టి విద్యాసాగర్ లు జిల్లా మొదటి స్థానం నాలుగో తరగతి విద్యార్థులు కోట షాలోమ్ బాబు ఉద్దండి రితికేషూ లు కృష్ణాజిల్లా మొదటి స్థానం సాధించారన్నారు. అలాగే తెలుగు సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో యార్లగడ్డ నాగలక్ష్మి కి మొదటి స్థానం లభించింది అన్నారు ఇంతటి విజయానికి కారకులైన ఉపాధ్యాయ సిబ్బందిని డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కొరివి అనిల్ కుమార్ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తమ్ము శకుంతల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించారు.

## మంచి ఆహారపు అలవాట్లే మంచి ఆరోగ్యం



**పాలకొల్లు,మే 29 (వార్తాప్రభ) :** మన ఆరోగ్యం మన అలవాట్లపై ఆధారపడి ఉంటుందని కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో గురువారం ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం ని లైబ్రేరియన్ వర్ధనపు శాంత కుమారి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కొల్లాబత్తుల సూర్య కుమార్ జీర్ణ ఆరోగ్యం గురించి విద్యార్థులకు వివరించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉన్నదని, ప్రతీ ఒక్కరూ తాము తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, తేలికగా జీర్ణమయ్యే తాజా ఆహారాన్ని, పండ్లను ఎక్కువగా తీసుకోవడంతో పాటు శారీరక, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా జీర్ణ ఆరోగ్యం ఉంటుందని అందరూ మంచి ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందగలమని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా తరగతుల రిసోర్స్ పర్సన్ కే.వి.వి. సత్యనారాయణ గ్రంథాలయ పాఠకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల తెలియజేశారు.

# దేవదేవుని అనుగ్రహంతోనే అన్నదానం లో భాగస్వామ్యం

● మండవ కుటుంబరావు ఆశయాన్ని కొనసాగిస్తాం



**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** లక్షలాది మంది భక్తులకు అన్న ప్రసాదం అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఒదిస్తున్న సేవలలో సామాన్య భక్తులు పాలుపంచుకునేలా ఒక మంచి బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించిన దివంగత మండవ కుటుంబరావు ఆశయాల కొనసాగింపే ప్ర లక్ష్యంగా మండవ కుటుంబరావు మిత్రమండలి పనిచేస్తుందని మరడ నాగేంద్ర అన్నారు. కుటుంబరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా బందరు రోడ్డులోని ఏ వన్ కన్వెన్షన్ సెంటర్ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల కూరగాయలతో బయలుదేరిన వాహనానికి మిత్ర మండలి సభ్యులు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదానం ప్రారంభించిన తొలి రోజుల్లో అన్నదానంలో అన్న ప్రసాదం స్వీకరించే భక్తులు వందల సంఖ్యలో ఉండేవారని, ఆ సంఖ్య ప్రస్తుతం లక్షల్లోకి చేరిందని తెలిపారు. కీర్తిశేషులు మండవ కుటుంబరావు ప్రారంభించిన ఈ అద్వితీయ కార్యక్రమం సుదీర్ఘకాలం పాటు కొనసాగించేందుకే మండవ కుటుంబరావు మిత్రమండలి గత రెండు సంవత్సరాలుగా టీటీడీకి కూరగాయలను అందజేస్తుందన్నారు. పదిమంది మేలు కోసం పనిచేసే ప్రతి ఒక్కరిపై భగవంతుడు అనుగ్రహం ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టేందుకు భగవత్సంకల్పం ఎంతో ముఖ్యమన్నారు. మిత్ర మండలి సభ్యులు మండవ శశి మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం మండవ కుటుంబరావు ప్రారంభించిన ఈ దైవకార్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరూ భగవంతుని ఆశీస్సులు పొందుతారన్నారు. మహామహిమాన్వితమైన దేవుని సన్నిధిలో లక్షలాది మందికి నిత్యాన్నదానం నిర్వహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అందిస్తున్న సేవలలో రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని అభిలషించారు. భక్తులు స్వామివారి ప్రసాదాన్ని సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వరస్వామి వారే భక్తుల కోసం పంపినట్టుగా భావించే స్థలంలో ఆహారం స్వీకరించేందుకు ప్రతి భక్తుడు ఇష్టపడతారన్నారు. దివంగత ధార్మికవేత్త మండవ కుటుంబరావు 2004లో ప్రారంభించిన ఈ మహోజ్వల కార్యక్రమం ఆయన మరణానంతరం ఎంతోమంది సేవాతత్పరుల దాతృత్వంతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఉండే మత విశ్వాసాల ఆధారంగా వారి వారి విశ్వాసాల ప్రకారం భగవదనుగ్రహం పొందడం కోసం చేసే సేవలలో ఆహారం పంపిణీ చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇటువంటి సేవలు అందించేందుకు ఆర్థిక శక్తి తో పాటు భగవంతుని అనుగ్రహం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు ఎంతోమంది దాతలు తనతో కలిసి రావడం భగవదనుగ్రహమేనన్నారు. లక్షలాది మందికి ప్రతిరోజు ఆహారాన్ని అందించడం ఎంతో కష్టమైన సేవ అని పేర్కొన్నారు. భగవంతుని అనుగ్రహంతో, దాతల సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తొలుత మండవ కుటుంబరావు చిత్రపటానికి పూలమాలలు వేసి సభ్యులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు మేదరమెట్ల శ్రీనివాస్ గుమ్మడి సురేష్, అరవపల్లి ఆదిత్య, శేష సాయి వర్మ, పైడిపాటి త్రినాథ్, మాజీ కార్పొరేటర్ గోగినేని సుజాత తదితరులతో సహా పలువురు ధార్మిక, ఆధ్యాత్మికవాదులు పాల్గొన్నారు.

# బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ సంఘం ఏర్పాటు..





**హైదరాబాద్, మే 29 (వార్తాప్రభ) :** బీసీ కులాల, బీసీ సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంఘాల నిర్మాణం లో భాగంగా శేరిలింగంపల్లి మహిళా సంక్షేమ సంఘం ఆవిర్భావం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామం నుండి హైదరాబాద్ పట్టణం వరకు ప్రతి గ్రామం బస్తి, కాలనీలో గల్లీ గల్లీకి బీసీ సంఘాలు ఏర్పాటు చేసే క్రమంలో అడ్వకేట్ రమేష్ యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా బేరి రామచంద్ర యాదవ్ మరియు బృందం ద్వారా శేరిలింగంపల్లిలో మహిళా సంక్షేమ సంఘం ఆవిర్భావం జరిగింది. శేరిలింగంపల్లి సంక్షేమ సంఘ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మహిళా సంఘం కోఆర్డినేటర్ గా లలితారాణి ని నియమించి నియామక పత్రం ఇవ్వడం జరిగింది. పూర్తిస్థాయి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శేరిలింగంపల్లి తదుపరి సమావేశంలో మహిళా మణులను సమావేశానికి ఆహ్వానించి పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు ఈ పేర్కొనడం జరిగింది. శేరిలింగంపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అడ్వకేట్ రమేష్ యాదవ్ మాట్లాడుతూ మహిళలందరూ ముందుకొచ్చి మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకోవడం శుభసూచకం మొదటగా శేరిలింగంపల్లి నియోజక వర్గం మరియు మండల్ ఏరియాలో సంఘాలు నిర్మాణం గావించి ప్రతి కాలనీలో బస్తీలు మహిళా సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేస్తామని అందులో భాగంగానే మొదటగా సమావేశపరిచి మహిళా సంఘం ఆవిర్భావం చేయడం జరిగిందని తెలిపారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మరియు శేరిలింగంపల్లి బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్ మాట్లాడుతూ అన్ని విసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ తన సందేశంలో మహిళలందరూ ఏకం కావాలి. మహిళలందరూ ఏకమైతేనే సమస్యలు దూరం అవుతాయన్నారు. 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని అందులో భాగంగా 33 శాతం లో నుండి 50 శాతం బీసీ మహిళలకు కేటాయించాలని చెప్పడం జరిగిందిమన ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీల ఐకమత్యమే మనకు ముఖ్యం బీసీల ఐక్యమత్యంతో రాజ్యాధికారం సాధించుకుందాం అని ఇంతవరకు మనకు బీసీలకు న్యాయం జరగలేదు రాజకీయ సామాజిక ఆర్థిక న్యాయం కోసం బిసి కులాలు బిసి సంఘాలు అన్ని పోరాడాలని అందులో భాగంగానే మహిళలు కూడా ముందుకు వస్తున్నందుకు చాలా ఆనంద దాయకం ముఖ్యంగా బస్తీ బస్తీకి, ప్రతి కాలనీలో మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని బేరి రామచంద్ర యాదవ్ ని అడ్వకేట్ రమేష్ ని కోరడం ఈ జరిగింది మన ఐకమత్యమే మనకు బలం ఎలాంటి సమస్యలైనా మనకు తీరటానికి సంఘాలు ప్రతి గల్లి గల్లి లో ఉండాల్సిందేనని పేర్కొన్నారు అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ మన ఐకమత్యమే మనకు బలం స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన బీసీలకు న్యాయం జరగలేదు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా న్యాయం కోసం పోరాటం ఉద్యమం చేయటం తప్పనిసరి అయింది రాబోవు లోకల్ బాడీ ఎలక్షన్లో సర్పంచి నుండి హైదరాబాద్ మేయర్ వరకు 42% రిజర్వేషన్ కల్పించి తీరాలని లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తూ. ఈ ఉద్యమం మహిళలు కూడా భాగస్వాములు కావాలని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ ,శేరిలింగంపల్లి అధ్యక్షులు అడ్వకేట్ రమేష్ యాదవ్, శేరి లింగం పల్లి ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి కృష్ణ సంయుక్త కార్యదర్శి కార్యవర్గ సభ్యులు అన్నూబాయ్ సింగ్, మహిళా సంఘం కో ఆర్డినేటర్ శ్రీమతి లలిత రాణి, ఆర్ అనిత ఎం సునంద జి నాగమణి విజయలక్ష్మి బి శ్రీదేవి న్యూ సంఘమా నిక ఎం మమత సురేఖ , మహిళల ఆవిర్భావ సమావేశం విజయవంతంగా ముగించారు.

# అవమానించిన చోటనుంచే జైత్రయాత్ర చేశారు!

● మీలాంటి కార్యకర్తలే మాకు స్ఫూర్తిగా నిలిచారు! ● ఉత్తరాంధ్ర సైకిల్ యాత్రికులకు లోకేష్ అభినందన

**కడప,మే 29 (వార్తాప్రభ) :** అవమానించిన చోటే సైకిల్ పై జైత్రయాత్ర చేసిన మీలాంటి పసుపు సైనికులే మాకు స్ఫూర్తి, ప్రతిపక్షంలో ఉండగా అధినేతకు అండగా మీలాంటి వారు అందించిన సంఘీభావంవల్లే గత ఎన్నికల్లో విజయఢంకా మోగించామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలను అభినందించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయనకు సంఘీభావంగా 2023 అక్టోబర్ 2న ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన నిద్రవెంగి రామకృష్ణ, చిల్లా రామసూరి, నిద్రవెంగి ఆదినారాయణ, బోయ పెంటారెడ్డి, ఎన్. సుందర్ రావు, సరగడ రమేష్ అనే కార్యకర్తలు ఎచ్చెర్ల నుంచి కుప్పం వరకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. సైకిల్ యాత్ర పుంగనూరు నియోజకవర్గం సుదాలమెట్టకు చేరుకున్న సమయంలో 2023 అక్టోబర్ 20న వైసిపికి చెందిన చెంగలాపు సూరి, మరికొందరు అతడి అనుచరులు టిడిపి కార్యకర్తలను చొక్కాలు విప్పించి తీవ్రంగా అవమానించి అడ్డుకున్నారు. ఆనాటి వైసిపి నాయకుల ఆ అరాచక పర్వం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమై సోషల్ మీడియాలో వైరల్ అయింది అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎక్కడైతే యాత్ర నిలిపివేశారో అక్కడి నుంచి ఆ ఆరుగురు టిడిపి కార్యకర్తలు సోమవారం సైకిల్ పై జైత్రయాత్ర ప్రారంభించి కడప మహానాడుకు చేరుకున్నారు. విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు నేతృత్వంలో ఆ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం కడప మహానాడు ప్రాంగణంలో యువనేత నారా లోకేష్ ను కలిశారు. ఈ సందర్భంగా యువనేత లోకేష్ వారిని అభినందిస్తూ... అరాచకపాలనపై మీవంటి వారు ధైర్యంగా గళమెత్తడం వల్లే గత ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధిచెప్పారని అన్నారు. కార్యకర్తలకు





ఎటువంటి కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని యువనేత లోకేష్ భరోసా ఇచ్చారు. లోకేషన్న ఇచ్చిన భరోసా తమకు కొండంత ధైర్యాన్నిచ్చిందని, భవిష్యత్తులో పార్టీకోసం మరింత ఉత్సాహంతో పనిచేస్తామని సైకిల్ యాత్రీకులు సంతోషం వ్యక్తంచేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : ఏపీట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు

**కాకినాడ,మే 29 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ట్రెజరీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా కాకినాడ జిల్లా ట్రెజరీ కార్యాలయంకు విచ్చేశారు. ఏపీ ఎన్జీఓ నాయకులు ట్రెజరీ ఉద్యోగుల జిల్లా శాఖ నాయకులు శ్రీనివాసరావు కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘన సన్మానం చేశారు.




ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియే షన్ సారథ్యంలో ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు ప్రభుత్వం వద్ద ప్రస్తావించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసం దర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గల ట్రెజరీ ఉద్యో గులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నాయకులు జి. రామ్మోహన్, పసుపులేటి శ్రీనివాస్,పాలపర్తి మూర్తి బాబు, పేపకాయల కృష్ణ, మాజీ నాయకులు ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం, మల్లాది సోమయాజులు, శశి, ట్రెజరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేపు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల కోర్టు లలో అడ్వకేట్ల విధుల బహిష్కరణ




**విజయవాడ, మే 29 (వార్తాప్రభ) :** తెనాలి ఐతా నగర్ లో పోలీసులు జరిపిన దౌర్జన్యకండ పై నిజ నిద్దారణ కమిటీ బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె బాషా , ఎ పి ఆర్ సి అధ్యక్షులు పిచ్చుక శ్రీనివాసరావు , తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ , గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై శివ సూర్య నారాయణ, ఎ పి సి ఆర్ కార్యదర్శి లక్మన్ ఫర్వాలేట్, న్యాయవాది సాగర్, మహమూద్ అలీ తదితరులు ది.27-05-2025 న తెనాలి వెళ్లి ఐతా నగర్ లో జరిగిన నేరాన్ని విచారించగా ఆ బాధితులలో గుంటూరు బార్ అసోసియేషన్ కి చెందిన ఒక లాయరు కూడా ఉన్నారని తెలిసింది.వారి మీద అన్యాయంగా కేసులు బనాయించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అతి క్రూరంగా లాఠీ ఛార్జ్ చేసారని ప్రథమ విచారణలో తెలిసింది. దీనితో పోలీసులు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘన జరిపారని భావించి బాధితులకు సంఘీభావం తెలిపి వారికి అండగా నిలబడాలనీ కృష్ణా జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎ కె బాషా నిర్ణయించుకున్నట్లుగా తెలిపారు. అందులో భాగంగా రేపు మే 30 న,కృష్ణాజిల్లా లోని అన్ని బార్ అసోసియేషన్ లు కోర్టులు విధులు బహిష్కరణ చేస్తూ పిలుపునిచ్చారు. అదేవిధంగా గుంటూరు బార్ అసోసియేషన్ మరియు ప్రకాశం జిల్లా బార్ అసోసియేషన్ కూడా రేపు కోర్టులు విధులు బహిష్కరణ చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పోలీసులు చేసిన ఈ దౌర్జన్యాన్ని ఖండిస్తూ బాధితులకు న్యాయం చేయాలని, పోలీసులను శిక్షించి, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు.

## డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌కు పటిష్ట భద్రత..

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ


● డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.





**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలలో భాగంగా విజయవాడ రూరల్ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్లను భద్ర పరిచే డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాల ఏర్పాటను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతుందన్నారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వై రామయ్య( టీడీపీ), తరుణ్ కాకాని (బిజెపి) కె. పరమేశ్వరరావు (ఏఏపి) కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సలీమ్ ఉన్నారు.

## జూన్ 2 న హనుమాన్ జంక్షన్ లోజిల్లా కాంగ్రెస్ కమిటీ సర్వ సభ్య సమావేశం : జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ



**హనుమాన్ జంక్షన్,మే 29 (వార్తాప్రభ) :** కృష్ణజిల్లా కాంగ్రేస్ పార్టీ సర్వసభ్య సమావేశము జూన్ 2 వ తేదీ ఉదయం11గంలకు గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నందు జరుగుతుందని జిల్లా కాంగ్రేస్ కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ తెలిపారు. అదే రోజు హనుమాన్ జంక్షన్ లో నూతనముగా కాంగ్రేస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేసమునకు ముఖ్యఅతిథిగా మనజిల్లా ఇన్చార్జి మార్నిడి బాబ్జీ పాల్గొంటారని తెలిపారు.ఏఐసిసిసభ్యులు ధనేకుల మురళీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వింతా సంజీవరెడ్డి, మొవ్వా మేహనరావు, రాష్ట్రఅనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గాల్లోని సమన్వయకర్తలు, జిల్లా కమిటికార్యవర్గం, మండలపార్టీఅధ్యక్షులు పాల్గొనాలని ఆయన కోరారు.రాష్ట్రఅధ్యక్షులు వైస్ షర్మిలా రెడ్డి రాష్ట్ర పర్యటనలో భాగముగా మనజిల్లాకు వస్తున్న సందర్భముగా ఏర్పాటు గురించి, గ్రామస్థాయి పార్టీ బలోపేతం గురించి, గన్నవరంలో విగ్రహరములను మార్పు చేయు చర్యలపై చర్చించడము,ఇటీవల గుడివాడ ఇన్చార్జిదత్తు మరణిచినందున సంతాపము తెలియచెయుట జరుగుతుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3గంలకు గన్నవరంలో కూడా పార్టీ కార్యాలయము ప్రారంభోత్సవం మన జిల్లాఇన్చార్జిమార్నీడిబాబ్జిగచేతుల మీదుగా ప్రారంబిస్తారని గొల్లు కృష్ణ తెలిపారు. రాష్ట్ర,జిల్లా నాయకులు విరివిగా పాల్గోని ఈ కార్యక్రమాన్నిజయప్రదంచేయాలని కోరారు.

# నాలాల పూడికతీత పనులకై 27 లక్షల రూపాయలు.

**మంజూరు చేయించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు**
**నాలా పూడికతీత పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ మేకల సునీతరామ్ యాదవ్**



**మల్కాజ్ గిరి :మే, 29:(వార్తా ప్రభ)** వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాపూర్తిత పనుల మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి 27 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ తెలిపారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు హనుమాన్ పేట్, జ్యోతి నగర్ ప్రాంతాలలో నాలాలలో పేరుకుపోయిన కూడికతీత పనులను ఆమె గురువారం సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాళాలలో పేరుకు పై ఉన్న వ్యర్థాలతోపాటు కూటికతీతను సకాలంలో తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లిపోవడానికి అధికారులు సిబ్బంది చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, సిద్ధిరాములు మర్రి శీను, వాసుదేవరావు, హబీబ్ వర్క్ ఇన్స్పెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జైహింద్ ర్యాలీకి తరలిన మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**మల్కాజిగిరి మే, 29:(వార్తా ప్రభ) :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించబోయే జైహింద్ ర్యాలీ, సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ మీర్జాలగూడ చిన్మయ మార్క్ లో స్వాతంత్ర సమరయోధుడు పెంటయ్య యాదవ్, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, గౌతమ్ నగర్ చౌరస్తా, మల్కాజ్గిరి చౌరస్తా నుండి బి బ్లాకు అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు వివిఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుండి కేజీఆర్ కన్వెన్షన్ జరగబోయే జైహింద్ ర్యాలీ కోలన్ గోపాల్ రెడ్డి కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన భారీ సభను ర్యాలీ గా వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో బికే .శ్రీను, వాయినాల ప్రవీణ్, మోహన్ రాజు, జంగాల శ్రీరామ్ యాదవ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, ఇస్తారి, ఫరీద్, శ్రీకాంత్ తో పాటు నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు శుభవార్త

**రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపునకు పచ్చ జెండా**
**నేడో రేపో వెలువడనున్న ఉత్తర్వులు**
**రిటైర్మెంట్ ప్రయోజనాలను రెట్టింపు చేసేందుకు కృషి చేసిన మంత్రి సీతక్కను సన్మానించిన అంగన్వాడీలు**

**హైదరాబాద్, మే, 29:(వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కి శుభవార్త చెప్పింది తెలంగాణ ప్రభుత్వం. పదవీ విరమణ (రిటైర్మెంట్) ప్రయోజనాల పెంపు కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ పంపిన ఫైల్కు ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఫైల్ను ఫైనాన్స్ శాఖ క్లియర్ చేయడంతో జీవో జారీకి మార్గం సుగమమైంది.ఇకపై పదవీ విరమణ పొందే అంగన్వాడీ టీచర్కు రూ. 2 లక్షలు, హెల్పర్కు రూ. 1 లక్ష అందనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 37580 పైగా అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి సెంటర్కు ఒక టీచర్, ఒక హెల్పర్ ఉండటంతో, సుమారు 70 వేల మంది సిబ్బంది ఈ వ్యవస్థలో పనిచేస్తున్నారు. ప్రతి ఏడాది సగటున 7000 మంది పదవీ విరమణ పొందుతుండగా.. రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లు గా ఉంది. ప్రస్తుతం టీచర్లకు రూ. 1 లక్ష, హెల్పర్లకు రూ. 50 వేలు మాత్రమే పదవీ విరమణ ప్రయోజనంగా లభించేది. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి రిటైర్మెంట్ ప్రయోజనాలను ప్రజా ప్రభుత్వం రెట్టింపు చేసింది.అయితే సాంకేతిక కారణాలతో ఫైల్ కొంతకాలంగా పెండింగ్లో ఉండగా, ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కతో సమావేశమై ఈ విషయంపై చర్చించి, అనుమతులు పొందారు. దీంతో సంబంధిత ఫైల్ కి ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. త్వరలోనే సంబంధిత జీవో జారీ కానుంది. ప్రభుత్వ నిర్ణయంతో వేల మంది కుటుంబాలకు ఆర్థిక భద్రత లభించనుంది.ఈ సందర్భంగా తమ పదవి విరమణ ప్రయోజనాల ఫైన్ క్లియర్ చేయించిన మంత్రి సీతక్కను భద్రాద్రి కొత్తగూడెంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పూలు కురిపించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# మున్నూరు కాపు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**వేములవాడ, మే, 29:(వార్తా ప్రభ)**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్నూరు కాపు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం రోజున కాపు సంఘం భవనంలో చేశారు. అధ్యక్షులు కోయినేని బాలయ్య, ప్రధాన కార్యదర్శి సోమినేని మహేష్ లు నూతన బాధ్యతలు చేపట్టిన వారిని కండువాతో సత్కరించారు. నూతన కార్యవర్గం వారి వివరాలు ఇలా ఉన్నాయి. గౌరవ అధ్యక్షులుగా నామాల పోచెట్టి, బింగి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మర్రిపెల్లి మల్లేశం, ఉప్పుల దేవరాజు, వరి లక్ష్మి నారాయణ, నామాల శేఖర్, ఆకుల శ్రీనివాస్, కూరగాయల శంకర్, కోశాధికారిగా రామతీర్థం వెంకటేష్, సంయుక్త కార్యదర్శి గా జయరపు శ్రీధర్, కార్యదర్శులుగా రామతీర్థం రాజు, బింగి మహేష్, కోయినేని శ్రీనివాస్, కొల రామ్మూర్తి లను నియమించారు.

# కళాకారులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

**తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మోహన్ బైరాగి, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి**



**జవహర్ నగర్, మే, 29:(వార్తా ప్రభ)**కాప్రా మండలం జవహర్ నగర్ లో ఆదివారం 11 గంటలకు తెలంగాణ కళాకారుల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఎర్రవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కామల్ల ఐలన్న టీకేవీ వ్యవస్థాపకులు మాట్లాడుతూ కళాకారులను రాజకీయ పార్టీలు ఉద్యమ సంస్థలు మోసం చేశాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వం 500 మందికి ఉద్యోగాలు ఇచ్చి మిగతా సబ్బండ కులాల కళాకారులను రోడ్డుపాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటుతున్న కళాకారులను పట్టించుకున్న పాపాన పోలేదు వృత్తిపరమైనటువంటి కళాకారులను ఆదుకొని పెన్షన్ ఏర్పాటు చేయాలని సంక్షేమ నిధులు 1000 కోట్ల రూపాయల కేటాయించి కళాకారుల అభివృద్ధి బాటలో నడిపించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు కదిలి ఉద్యమాలు చేస్తారని వారన్నారు. తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు,మోహన్ బైరాగి ప్రధాన కార్యదర్శి వెంకటాచారి మాట్లాడుతూ కళాకారులు సంఘటిత ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, ప్రభుత్వం వెంటనే కల్చరల్ పాలసీ ప్రకటించాలని, అన్ని శాఖలలో కల్చరల్ కోటా ను ఏర్పరిచి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాచకొండ రమేష్ ఎర్రమల్లేష్ నలి గంటి శరత్, విష్ణు కిషోర్,ముఖ్య అతిధులు గా పాల్గొన్నారు..

# డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న చోట ప్రధమ ప్రాధాన్యతగా తక్షణమే పరిష్కరించండి

● **అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గాంధీ.**



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ,ఎఫ్.సి.ఐ కాలనీ, బాలాజీ నగర్,ఆదిత్య నగర్,జెపి నగర్, ఏఎస్ రాజు నగర్ కాలనీలలో రూ. 85 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టబోయే భూగర్భ యుజిడి పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని,పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మరియు మా కార్పొరేటర్లు,మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఫ్రెండ్స్ కాలనీ, ఎఫ్.సి.ఐ కాలనీ,బాలాజీ నగర్, ఆదిత్య నగర్,జెపి నగర్,ఏఎస్ రాజు నగర్ కాలనీలలో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు,అత్యవసరం ఉన్న చోట,నిత్యం పొంగుతున్న ప్రాంత లలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.అదేవిధంగా సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి గాని,కార్పొరేటర్ దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని,కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జిఎం నారాయణ,డిజిఎం అమీరుద్దీన్,మేనేజర్ సునీత మరియు నాయకులు కార్యకర్తలు,కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

● **బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మే 29 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జంట సర్కిళ్లయిన కుత్బుల్లాపూర్, గాజుల రామారం ఉప కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులతో వివిధ డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని సమాయత్తం చేస్తూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సిద్ధంగా ఉండాలని, అలాగే వివిధ కాలనీలలో, బస్తీలలో కొనసాగుతున్న రోడ్డు, భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంట సర్కిళ్ల లోని బస్తీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ డివిజన్లలో అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలలో పిల్లలు, పెద్దలకు ఆహ్లాద భరితంగా ఉన్న పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఓపెన్ జిమ్ ల నిర్వహణ, ప్రహరీ గోడ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలన్నారు. జంట సర్కిళ్ల పరిధిలోని శ్రీనివాస్ నగర్, కళావతి నగర్, దేవేందర్ నగర్, భగత్ సింగ్ నగర్, పద్మా నగర్ ఫేస్ 1 కాలనీలలోని స్మశాన వాటికలను ఆధునీకరించి మోడర్న్ గ్రేవ్ యార్డ్ నిర్మించాలని సూచనలు చేశారు. మోడల్ మార్కెట్లను ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా 100% వినియోగించాలి. అవసరమైన చోట కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను చేపట్టి ప్రజలకు అవసరమయ్యేలా చూడాలి. జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సిగ్నల్ లను ఏర్పాటు చేయాలి. జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులలోని సిబ్బంది కోసం విశ్రాంతి గదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలి. పరికచెరువులో మురుగునీరు కలవకుండా శుద్ధికరణ చర్యలు చేపట్టి చెరువును సుందరీకరించాలి. 128 చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నా పనులను చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి.129 సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. 130 సుభాష్ నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్ప నుంచి ఎస్.ఆర్. నాయక్ నగర్ వరకు నాలా పనులను అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మించాలి. విద్యాసంస్థలు, ఆస్పత్రులు అధికంగా ఉన్న చింతల్ మెయిన్ రోడ్ లో పాదాచారులు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలి. పాపయ్య యాదవ్ నగర్ నుంచి బాలానగర్ బిబిఆర్ ఆసుపత్రి వైపుగా వెళ్ళే నాలా విస్తరణ పనులను చేపట్టే విధముగా కూకట్ పల్లి సర్కిల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలి. తద్వారా కుత్బుల్లాపూర్ లో వరద ప్రవాహం సాఫీగా సాగుతుందని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాలని, ఈ పథకాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఏర్పాటుచేసిన డివిజన్ వార్డు ఆఫీసులలో నిర్ణీత సమయాన్ని నిర్దేశించి అధికారులు, సిబ్బంది ఉండి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, విజయ శేఖర్ గౌడ్, రషీదా మహమ్మద్ రఫీ, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, కెఎం.గౌరీష్, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు లక్ష్మీ గణేష్, కిష్టప్ప, డీఈ లు పాపమ్మ, శిరీష, రూపాదేవి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో జిల్లా ఫస్ట్

**జిల్లా కలెక్టర్ కు మంత్రుల అభినందనలు**




**రాజన్న సిరిసిల్ల, మే, 29:(వార్తా ప్రభ)** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా అధికారులను మంత్రులు అభినందించారు.జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7808 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో ఫేజ్-1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్-1లో 42 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఫేజ్- 2లో 763 మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. ఫేజ్ 1 కింద జిల్లాలో మొత్తం 439 ఇండ్లు మంజూరు చేయగా, 135 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలోని 11 మండలాల్లో మొదలు పెట్టిన మోడల్ హౌస్ లలో బేస్మెంట్ లెవెల్ లో మూడు, రూఫ్ లెవెల్లో రెండు, స్లాబ్ లెవెల్ లో ఆరు ఇండ్లు ఉన్నాయి.ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో గురువారం నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను, జిల్లా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

# హైదరాబాద్

## ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**కీసర, నాగారం, మే, 29:(వార్తా ప్రభ)** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోయిన్పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న జైహింద్ యాత్ర లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, శశిధర్ రెడ్డి, రాంగోని శ్రీనివాస్ గౌడ్, బొల్లబోయిన సత్యనారాయణ యాదవ్, మాదిరెడ్డి రాజిరెడ్డి, వి ఎస్ మూర్తి, షేక్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మే 29 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద భాగ్యలక్ష్మి కాలనీ కి చెందిన కె.కిరణ్ కుమార్ తండ్రి కె.కేదారి(41) ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారుడు కె.కిరణ్ కుమార్ కు 2.00 లక్షల రూపాయలను మంజూరు చేయించి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గోశాలను సందర్శించిన రాజన్న ఆలయ ఈవో వినోద్



**వేములవాడ, మే, 29:(వార్తా ప్రభ)** శ్రీరాజరాజేశ్వరస్వామికి సంబంధించిన తిప్పాపురం గోశాలను ఈవో వినోద్ గురువారం సందర్శించారు. గోశాలలో ఉన్న వరి గడ్డి కట్టాలను పరిశీలించారు.గోవులకు, కోడెలకు భక్తులు ఇచ్చిన వరి గడ్డిని ఆలయ అధికారులు,సిబ్బంది,సేవా సమితి సభ్యులు చేస్తున్న పనిని పర్యవేక్షించారు.తడిచిన వరిగడ్డిని ఆరబెట్టి సంరక్షించే ప్రయత్నం చేస్తున్నారని, అధిక మొత్తంలో వరి గడ్డి భారీ వర్షంతో తడిచిపోయిందని, దీంతో గ్రాసాన్ని ఆరబెట్టి టార్పిన్ కవర్లతో కప్పి సంరక్షించే పనిలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. గోశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ అకాల వర్షాలతో కొంతమేరకు ఇబ్బంది విషయం వాస్తవమేనని, ప్రతిరోజు వేములవాడ రాజన్న ఆలయం సంబంధించిన రెండు గోశాలలో సిబ్బంది సమయపాలన పాటిస్తూ పచ్చిగడ్డి వేస్తూ వాటిని సంరక్షిస్తున్నారని అన్నారు. గోశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత మరిన్ని సౌకర్యాలు కోడెలకు,గోవులకు అందుబాటులోకి వస్తాయన్నారు. గోశాలలో ఇబ్బందులు వర్షాభావం నేపథ్యంలో నీటిని తొలగించి బురద సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.అధిక సంఖ్యలో పలు సేవాసమితి సమితి సభ్యులు,ఆలయ అధికారులు,సిబ్బందితో కలిసి ఈవో వినోద్ సైతం శ్రమదానం చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. వారి వెంట ఆలయ ఈఈ రాజేష్, ఏఈ రామకృష్ణారావు ,గోశాల పర్యవేక్షకులు విజయ్, కూరగాయల శ్రీనివాస్ ఆలయ సిబ్బంది ఉన్నారు.

# ఎడిటోరియల్


## తాజా కొవిడ్ కేసులతో టెన్షన్ పడాల్సింది ఎంత?

విన్నంతనే ఉలిక్కిపడేలా చేయటమే కాదు.. జీవితంలో కొవిడ్ నాటి పరిస్థితులు మళ్లీ ఎదురు కాకూడదన్న భావన ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అందుకే కొవిడ్ అన్నంతనే ఉలికిపాటు ఖాయం. గడిచిన కొంతకాలంగా కొవిడ్ మాట అప్పుడప్పుడూ వింటున్నా.. ఈసారి మాత్రం సౌండ్ కాస్త ఎక్కువగానే వినిపిస్తోంది. విదేశాల్లోనూ కొవిడ్ కేసులు నమోదవుతున్న తీరు.. తాజా వేరియంట్ ను అంత సింపుల్ గా తీసుకోకూడదన్న మాటలు వినిపిస్తున్నాయి. ఏపీ లాంటి రాష్ట్రాల్లో ఈ వేరియంట్ మీద మరింత అప్రమత్తత పెరిగేలా అడ్వైజరీ విడుదలైంది. ఏపీతో పోలిస్తే తెలంగాణ ప్రభుత్వం తన ప్రకటనతో టెన్షన్ తెప్పించలేదనే చెప్పాలి. ఇదిలా ఉంటే.. దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోందని.. మంగళవారం రాత్రి నాటికి దేశంలో యాక్టివ్ కొవిడ్ కేసులు 1010గా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కొవిడ్ కొత్త వేరియంట్ ఎన్ బీ. 1. 8. 1తో పాటు ఎల్ఎఫ్. 7ను భారతదేశంలో గుర్తించిన విషయం తెలిసిందే. ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర కొవిడ్ కేసుల వ్యాప్తి తక్కువగానే ఉందంటున్నారు. ఎక్కడో ఒకరిద్దరు మినహాయిస్తే.. ముఖానికి మాస్కులు పెట్టుకొంటున్న వారి సంఖ్య కూడా ఎక్కువగా కనిపించని పరిస్థితి. ఇలాంటి వేళ కొవిడ్ తాజా వేరియంట్ను ఎంత సీరియస్ గా తీసుకోవాలి? జాగ్రత్తల విషయంలో ఎలా ఉండాలి? లాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటివరకు పరిస్థితిని సమీక్షిస్తే.. కొవిడ్ తాజా వేరియంట్ల తీవ్రత మన దేశంలో తక్కువగా ఉన్నా.. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇక.. కొవిడ్ కేసులు పెరగటానికి కారణం.. గతంలో ఇన్ఫెక్షన్లు సోకడం.. టీకాలు వేసుకోవటం ద్వారా వచ్చిన రోగనిరోధక శక్తి క్షీణించటం కూడా కారణంగా చెబుతున్నారు. ఇప్పుడు వెలుగు చూసిన కొత్త వేరియంట్లు (జేఎన్. 1, ఎన్ బీ 1. 8. 1) బాధితుల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టిన దాఖలాలు కనిపించ లేదన్న మాట పలువురి నోట వినిపిస్తోంది. అధిక తేమతో కూడిన పరిస్థితుల్లో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. తాజాగా ఎంట్రీ ఇచ్చిన రుతుపవనాలు.. గాలిలో తేమ శాతం అదికంగా ఉండటం లాంటి పరిస్థితుల్లో కొవిడ్ కొత్త వేరియంట్ వ్యాప్తి ఎక్కువయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే. సింగపూర్.. ఇతర ఆగ్నేయాసియా దేశాల్లో కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నాయి. భారత్ లో మాత్రం కొవిడ్ వ్యాప్తి కొన్ని ప్రాంతాలకే పరిమితమైనట్లుగా కనిపిస్తోంది. దేశంలో నమోదైన మొత్తం యాక్టివ్ కేసుల్లో 43 శాతం కేరళలోనే ఉండగా.. తర్వాత మహారాష్ట్ర 21 శాతంతో.. ఢిల్లీ (10 శాతం).. గుజరాత్.. తమిళనాడు రాష్ట్రాలు సింగిల్ డిజిట్ లో ఉన్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో 60 ఏళ్లకు పైబడిన వారు.. అనారోగ్యాలతో బాధ పడే వారు మాత్రం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవటం తప్పనిసరిగా చెబుతున్నారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు ధరించటం.. చేతుల్ని శుభ్రంగా ఉంచుకోవటం.. కొవిడ్ లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్భందంలోకి వెళ్లటం లాంటి చర్యలు తీసుకోవటం మంచిదంటున్నారు. మొత్తంగా చూస్తే.. ఇప్పటి వేరియంట్లను బూచీలా చూసి భయపడటం కన్నా.. అప్రమత్తతతో జాగ్రత్తగా ఉండటం మంచిదని చెప్పక తప్పదు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. పోరాటం ఆత్మగౌరవం త్యాగాలకు మారుపేరుగా తెలంగాణ నిలిచిందని అని చేవెతులకు వ్యతిరేకంగా మొక్కుబోని ధైర్యంతో రాజీలేని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నామన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు సరైన గుర్తింపు లేదని ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం వారికి వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు నెలకు 30.000 గౌరవ వేతనం ప్రతినెల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్మృతి వనం 100 ఎకరాలలో ఏర్పాటు చేయాలన్నారు. మలిదశలో అమరులైన 1200 మంది లో కొందరికి గత ప్రభుత్వం సహాయం చేయగా మిగిలిన కుటుంబాలకు 10 లక్షల నగదు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తొలి దశ ఉద్యమకారుల కుటుంబాలకు కూడా ఆర్థిక ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కూడా అందజేసి ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల కుటుంబాలకు విద్య ఉద్యోగాలలో రాజకీయ రంగాలలో రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రమాద బీమా 20 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు.

## మనసే కీలకం



మనసుతోన యుద్ధము
చేయాలోయ్! అనిశము
నియంత్రణ చేస్తేనే
పొందుతాడు విజయము
మనసే ఒక భ్రమరము
తిరుగును నిరంతరము
అన్ని వేగాల కన్న
బహు మిన్న మనోవేగము
మనసునే జయిస్తే
అవుతాడోయ్! విజేత
విశ్వశాంతి తెస్తే
అగునోయ్!శాంతి దూత
కీలకం బ్రతుకులో
మనసే చూడంగా
ఉంచితే అదుపులో
అవుతావు వీరునిగా

**గద్వాల సోమన్న**
,సెల్:9866414580

# రెడ్డిగూడెంలో 50%సబ్సిడీ తో విత్తనాలు పంపిణీ,

- రైతన్నకు భరోసా - భూసారాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం మరో అడుగు
- 50% సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాగేశ్వరరెడ్డి



**రెడ్డిగూడెం, మే, 29:(వార్తా ప్రభ)**రైతన్న భూమిని బంగారు భూమిగా మార్చాలన్న సంకల్పంతో తెలుగు దేశం - జనసేన - బీజేపీ కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. భూసారాన్ని పెంపొందించి దిగుబడులు మెరుగుపరచాలన్న దృష్టితో, కూటమి ప్రభుత్వం ప్రారంభించిన 50% సబ్సిడీ పథకం కింద నాణ్యమైన పచ్చిపంటల విత్తనాల పంపిణీ కార్యాచరణ ప్రారంభమైంది. ఈ పథకం కింద: జనుములు (10 కేజీలు) ?550కు పిల్లి మిసర్లు (8 కేజీలు) 720కురైతులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లుతూ, రెడ్డిగూడెంలో టీడీపీ నాయకుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:"రైతు నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా ప్రభుత్వ తొలి కర్తవ్యం. భూసారాన్ని పెంచితే పంటల లాభం పెరుగుతుంది. ఇదే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని గ్రామ స్థాయికి తీసుకొచ్చి ప్రతి రైతు భూమి సారవంతంగా, నాణ్యమైన పంటలు పండే విధంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం రైతుల హృదయాలను గెలుచుకుంది అని నాణ్యమైన విత్తనాలు తక్కువ ధరకు లభించడం వల్ల రైతుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ పథకం భవిష్యత్తులో రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాన్ని సులువుగా చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పైడమర్ల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇది కేవలం విత్తనాల పంపిణీ కాదు...ఇది భూమిలో భరోసా నాటిన పునాది. రైతు ఆశలకి కూటమి ప్రభుత్వం ఇచ్చిన విశ్వాసం.

# వీధి పేరు, నగర్ పేర్లకు మంచి గుర్తింపు తెచ్చేవే ఆర్చిలు

- న్యూవ్ చాంద్ హెూటల్ అధినేత షేక్ హంది దంపతులు ఉదారతతో పోతిన చిన్నా నగర్ ఆర్చి నిర్మాణం కి శంకుస్థాపన



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూతనంగా ఏదైనా కాలనీ లేదా నగర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక హెూదా లేదా గుర్తింపు తెచ్చేది కేవలం వాటి ఉనికిని చాటేలా నిర్మించే ఆర్చిలేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యూ చాంద్ హెూటల్ అధినేత షేక్ హంది దంపతులు, వేలాది రూపాయలు వెచ్చించి ఆర్చి నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలోని సి వి ఆర్ ఫ్లై ఓవర్ పక్కన ఉన్న సాయి అమరావతి హైట్స్, అస్త్ర అపార్ట్మెంట్ ,విఘ్నేష్ హైట్స్ నివాసితుల సంక్షేమం కోసం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు చొరవతో రూ 44 లక్షల 35 వేల వ్యయంతో పక్కా సి సి రోడ్డు నిర్మించగా ఆ రోడ్డుకు పోతిన చిన్నా పేరు పెట్టిన విషయం తెల్సిందే, ఐతే ఈ ప్రాంతానికి వన్నె తెచ్చేలా ఆ పేరుతో ఓ ఆర్చి నిర్మించాలనే ప్రతిపాదనలు సాయి అమరావతి హైట్స్ ప్రతినిధులు తెరపైకి తెచ్చారు. ఐతే అదే అపార్ట్మెంట్ లో నివాసం ఉంటున్న న్యూ చాంద్ హెూటల్ అధినేత ఆ ఖర్చు మొత్తాన్ని తానే భరించి ఆర్చి నిర్మాణం చేపట్టి దానికి గురువారం శంఖుస్థాపన చేసిన హంది దంపతులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్షద్ , సాయి అమరావతి హైట్స్ ప్రెసిడెంట్ వాంద్రసి సూర్య ప్రకాశరావు, సెక్రటరీ ఇమ్మంది ఉమాశంకర్, వైస్ ప్రెసిడెంట్ కనిశెట్టి రమేష్ , కమిటీ సభ్యులు, అస్త్ర అపార్ట్మెంట్ ప్రతినిధులు యేమినేని వెంకట రమణ,బొలిశెట్టి బ్రహ్మానందం, విఘ్నేష్ హైట్స్ ప్రతినిధులు ఎమ్ శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ, మూడు అపార్ట్మెంట్ల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సుజనా చౌదరి కోలుకోవాలని సాయిబాబా ఆలయంలో పూజలు




**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి ) త్వరగా కోలుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు బొబ్బిలి లీల కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గురువారం గొల్లపాలెం గట్టు సాయిబాబా ఆలయంలో బొబ్బిలి లీలా కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి పాల్గొని బాబా ఆశీస్సులు అందుకున్నారు.మే మొదటి వారంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రమాదవశాత్తు గాయపడి శస్త్ర చికిత్స జరగడంతో వైద్యుల సూచనల మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందేఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని కూటమినేతలు , ప్రజలు తమ ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత బొబ్బిలి లీలా కుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజాక్షేమాన్ని కాంక్షించే సుజనా చౌదరి కి ఎటువంటి ఆటంకం కలగకుండా త్వరగా కోలుకోవాలని ప్రజాసేవకు పునరంకితం కావాలని బాబా సన్నిధిలో పూజలు నిర్వహించామన్నారు .కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటేశ్వరరావు,ఎన్డీఏ కూటమి నేతలు అల్లం సింహాచలం, సుజన, ఝాన్సీ లక్ష్మీ బాయి , సిహెచ్ బేబీ రత్నకుమారి, బొబ్బిలి లీలావతి, భూపతి స్వాతి, లోకేశ్వరి, తెల్లాకుల శేషబాబు, యర్రం శెట్టి చరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో ఎటువంటి అంతరాయం ఉండరాదు

***విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు***





**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో ఎటువంటి అంతరాయం ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్ పర్యటించి గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ సఫాయి కర్మచారి పథకం లో భాగంగా కొత్తగా వచ్చిన ఐదు పెద్ద టిప్పర్ వాహనాలను పరిశీలించారు. లబ్ధిదారులతో పెద్ద టిప్పర్లను సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వ్యర్థాల నుండి సంపద సృష్టిస్తున్న చర్యలను ఎటువంటి అంతరాయం లేకుండా చేస్తూనే ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అజిత్ సింగ్ నగర్ వద్ద గల అన్న క్యాంటీన్ ను పరిశీలించారు సమయపాలన సక్రమంగా జరుగుతుందా లేదా అని అక్కడున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఆహారంలో నాణ్యత పరిశుభ్రతాపరిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నా క్యాంటీన్లో వస్తున్న ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్బ్యాక్ను తెలియచేయొచ్చునని తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసు పాదం, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జక్కా వెంకయ్య వర్ధంతి వేడుకలు



**ఆత్మకూరు మే 29(వార్తాప్రభ)**కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ గౌస్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. నేటి యువతకు ఆయన ఆశయాలు పోరాటాలు ఆదర్శం కావాలన్నారు. మూలి వెంగయ్య మాట్లాడుతూ వెంకన్న చిన్న నాటినుంచే ఉద్యమాల్లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య సీనియర్ నాయకుడు మహ్మద్ గౌస్ సూర్య నారాయణ సుధాకర్ ముప్పాల్ల తిరుపతి హజరత్తయ్య కాజావలి పోలి రెడ్డి జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కొక్కంటి పోలయ్య ఎస్.కె. రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలిన గొల్లపల్లి టిడిపి నాయకులు



**చేజర్ల మే 29 (వార్తాప్రభ)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సూచనలతో చేజర్ల మండలంలోని గొల్లపల్లి గ్రామం టిడిపి నాయకులు ఉడతా హజరతయ్య ఉడతా త్రిబువన్ బాబు ఆధ్వర్యంలో కడపలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభకు గ్రామ ప్రజలు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఆ గ్రామ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధిని చూసి ప్రజలు భారీగా తరలి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. అలాగే మంత్రి ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తూ కార్యకర్తలకు అండగా ఉండడం తో కార్యకర్తలు ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

## కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ను పరామర్శించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , ఎన్డీఏ కూటమి నేతలు ..





**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గం 39 వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి పరామర్శించారు .ఆర్థిక ఇబ్బందుల కారణంగా నరేంద్ర రాఘవ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. గొల్లపూడి ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ త్వరగా కోలుకోవాలని ప్రత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు. ఎన్డీయే కూటమి నేతలు బొల్లేపల్లి కోటేశ్వరరావు, పత్సవ మల్లికార్జున, బ్రహ్మారెడ్డి, మైనంపాటి రమేష్, సుజనా మిత్ర కోఆర్డినేటర్లు కొల్లి దుర్గారావు, సప్పా శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

## టీడీపీ సీనియర్ నేత ఎర్రా రామారావు కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఎన్డీఏ కూటమి నేతలు



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గ ఎస్.సి. సెల్అధ్యక్షులు, సీనియర్ టీడీపీ నాయకులు ఎర్రా రామారావు(53) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ , బీజేపీ, జనసేన నేతలతో కలిసి రామారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ అండగా ఉంటుందని వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ,ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య , మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నేతలు బొల్లేపల్లి కోటేశ్వరరావు, పత్సవ మల్లికార్జున , విశ్వేశ్వరరావు,బ్రహ్మారెడ్డి, మైనంపాటి రమేష్ , సుజనా మిత్ర కోఆర్డినేటర్లు కొల్లి దుర్గారావు, సప్పా శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

## బహిరంగ ప్రదేశంలోమద్యం సేవనం

### డ్రోన్ల సహాయంతో నిందితుల పట్టివేత

**ఉంగుటూరు, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డ్రోన్ కెమెరాల సహాయంతో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని ఉంగుటూరు పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు విశిష్ట కృషి చేస్తూ, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, ఆకతాయిలు వేధింపులకు పాల్పడిన, చట్ట వ్యతిరేక, జూద కార్యకలాపాలు నిర్వహించినా మిమ్మల్ని పసిగడతామని కృష్ణా జిల్లా పోలీసులు హెచ్చరించారు. అందులో భాగంగా ఈరోజు ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంగుటూరు గ్రామ శివారులో డ్రోన్ కెమెరాల సహాయంతో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ముగ్గురిని గుర్తించి వారిని అదుపులోనికి తీసుకొని వారిపై ఉంగుటూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.

# పోలీసు శాఖలో మానసిక శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి పోలీసు యోగాంధ్రా

### నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు













**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** 1 1 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం బి.ఆర్.టి.ఎస్.రోడ్డు వద్ద ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పరిదిలో పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రెటరీ కె.విజయానంద్ , హెల్త్ డిపార్ట్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణ బాబు , శ్రీమతి ఆర్.జయలక్ష్మి , నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు , ఈగల్ ఐ.జి. ఆకే రవి కృష్ణ , ఐ.జి. శ్రీమతి రాజ కుమారి , ఎ.పి.ఎస్.పి. ఐ.జి. శ్రీమతి రత్న కుమారి , జిల్లా కలెక్టర్ లక్ష్మి షా, వీరపాండ్యన్, ఇతర ఐ.ఎ.ఎస్. అధికారులు, డి.సి.పి.లు శ్రీమతి కె.జి.వి.సరిత , తిరుమలేశ్వర రెడ్డి , కృష్ణ మూర్తి నాయుడు , ఎస్.వి.డి.ప్రసాద్ , ఎన్.టి.ఆర్.జిల్లా లా %ಒ% ఆర్డర్, ట్రాఫిక్, ఇంటిల్ జెన్స్, ఆక్టోపస్,ఎస్.ఎస్.జి., ఐ.ఎస్.డబ్ల్యూ, హొంగార్డ్స్, సైబర్ సోల్జర్స్, సురక్ష, ట్రాఫిక్ అంబాసిడర్స్, ఆయుష్, ఓం శాంతి, బ్రహ్మ కుమారీస్, అమరావతి యోగా, పతంజలి ఆర్ట్ ఒఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్,ఐ జి ఎమ్ ఎస్ , మదర్సా మొదలగు యోగా డిపార్ట్మెంట్ వారు, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 6000 మంది పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సంధర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ......... గౌరవ ప్రధానమంత్రి వర్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గార్లు దేశంలో ప్రతి ఒక్కరూ ఒక నెలపాటు క్రమం తప్పకుండా యోగ చేయాలని సందేశం అందించారు. యోగాంధ్ర లో నేడు పోలీసు కుటుంబం భాగస్వామ్యం అయ్యింది, సుమారు ఆరు వేల మందితో నేడు యోగాంధ్ర లో పాల్గొనడం ఆనందంగా ఉంది, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు యోగాంధ్ర కు తరలి వస్తున్నారు, యన్టీఆర్ జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ యోగాంధ్ర నిర్వహిస్తున్నారు, చీఫ్ సెక్రటరీ , ఇతర ఉన్నతాధికారులు నేడు యోగాలో పాల్గొనడం సంతోషంగా ఉంది, పోలీసు పరంగా యోగాంధ్ర కు ఎల్లప్పుడూ మా సహకారం అందిస్తాం, ఆనందం, ఆరోగ్యం యోగాతోనే సాధ్యం, రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ను యోగాంధ్ర గా మార్చేందుకు చేస్తున్న కృషికి ప్రజలు సహకారం అందించాలి, ప్రతి ఒక్కరూ తన జీవనశైలిలో యోగా ను ఒక భాగంగా చేసుకోవాలని, యోగా చేయడం ద్వారా శరీరం ఫ్లెక్సిబుల్ గా, చురుగ్గా ఉంటూ పనిలో ఒత్తిడిలు ఉండవు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే వారి పని భారం, ఒత్తిడి లకు గురికాకుండా ఆరోగ్యం మెరుగుపడుతుంది. మనిషి ఆరోగ్యం వృద్ధి చేసుకోవాలంటే యోగ తప్పనిసరి తెలియజేశారు. జిల్లా కలెక్టర్ లక్ష్మి షా మాట్లాడుతూ..... ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నేడు యోగాంధ్ర నిర్వహించాం, సహకరించిన పోలీసు కమిషనర్ కి, పోలీసు సిబ్బంది కి నా ధన్యవాదాలు, చీఫ్ సెక్రటరీ , హెల్త్ సెక్రటరీ ,ఇతర అధికారులు పాల్గొనడం ఆనందంగా ఉంది, ప్రతి రోజూ ఇక్కడ వివిధ వర్గాల వారితో కలిపి యోగాంధ్ర ను నిర్వహిస్తున్నాం అని తెలియజేశారు. ఎపి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మాట్లాడుతూ... మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు,ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం యోగా చేయాలి, మన శరీరం, మనసును ఆధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతో ఉపయోగ పడుతుంది ,ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పం తో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర ను చేపట్టింది, 45 నిమిషాల ఆసనాలతో అనారోగ్యాలు దరి చేరకుండా చూడవచ్చు, ఎటువంటి ఒత్తిడిని అయినా తట్టుకుని నిలబడేలా యోగా సహకరిస్తుంది, అన్ని వర్గాల ప్రజలు ఈ యోగాంధ్ర లో భాగస్వామ్యం కావాలి, జూన్ 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది పాల్గొంటారు, ప్రతి జిల్లాలో నెల రోజుల పాటు యోగాంధ్ర నిర్వహిస్తున్నారు, వేలాది మంది ప్రజలు ఆయా జిల్లాల్లో పాల్గొంటున్నారు, కృష్ణబాబు గారు దీనికి సంబంధించిన కార్యక్రమం డిజైన్ చేశారు, యన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్ ల ఆధ్వర్యంలో ఇక్కడ యోగాంధ్ర బాగా జరుగుతుంది. ప్రజలు కూడా యోగాసనాల పై అవగాహన పెంచుకోవాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓం శాంతి బ్రహ్మకుమారీలు యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు.

## కెనోయ్ ఛాంపియన్ షిప్ లో కాంస్య పతక విజేత గొలుగూరి వర్షితను అభినందించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు





**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత నెల 24 నుంచి 28 వరకు బోపాల్ లోని లోయర్ లేక్ వేదికగా జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్ షిప్ లో కంస్య పతకం సాధించిన అథ్లెటిక్ గొలుగూరి వర్షితను పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు అభినందించారు. పడమట ఎన్ ఎస్ ఎం పబ్లిక్ స్కూల్ లో ఎనిమిదవ తరగతి చదువుతున్నట్లు, కెనోయ్ ఈవెంట్ లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుండి వర్షిత ఒక్కర్తే ఎంపిక అయినట్లు, బోపాల్ నందు జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్ షిప్ లో సబ్ జూనియర్ కె4 500మీ. ల విభాగంలో ఒడిశా జట్టుకు ప్రాతినిధ్య వహించి తృతీయ స్థానం సాధించినట్లు వివరించగా, వర్షిత చదువుల్లో, అథ్లెటిగ్గా రాణించి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆకాంక్షించారు

## మార్కెట్ లో రెండు క్రిమి సంహారిక మందులు

**హైదరాబాద్, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : బీఏఎస్ ఎఫ్ ఇండియా నుండి మరో రెండు క్రిమి సంహారిక మందులు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ పార్క్ హయత్ లో వరి పంటకు వచ్చే దోమపోటు... తెగుళ్ళ కోసం వాలెక్సియా, మిబెల్యా పురుగుమందులను సంస్థ ప్రతినిధులు లాంచ్ చేశారు . ఈ క్రిమి సంహారిక మందుల వల్ల రైతులకు అధిక దిగుబడితో పాటు నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని సంస్థ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు . భారతీయ వ్యవసాయ రంగం పురోభివృద్ధి సాధించేందుకు ఈ సరికొత్త ఉత్పత్తులు ఎంతగానో దోహదపడతాయన్నారు .

## మహారాణా ప్రతాప్ జయంతి

**హైదరాబాద్, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని ఆసిఫ్ నగర్ డివిజన్ లో బిజెపి సెంట్రల్ జిల్లా స్పోక్స్ పర్సన్ రవికుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక యువత ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని రక్త దానం చేశారు. ప్రమాద సమయాలలో ఎంతోమంది రక్తమంధక మృతి చెందుతున్నారని అలాంటి వారికోసం ఈ రక్తదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు రవి తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి

### ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్






**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరికి వ్యాయామం తప్పనిసరి అని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు.పశ్చిమ నియోజకవర్గం 56 వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేట ఉర్దు స్కూల్ పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన వి.ఎం.సి జిమ్ ను గురువారం ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,స్థానిక కార్పొరేటర్ ఎలకల చలపతిరావు తో కలిసి అడ్డూరి శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ నేటి యువతలో ఉద్యోగాల రీత్యా ఉరుకుల, పరుగుల జీవన ప్రయాణంలో శారీరక శ్రమ తగ్గిపోతుందన్నారు. కార్పొరేషన్ నిధులు సుమారు రూ 14 లక్షలతో ఆర్ఆర్ పేటలో జిమ్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. అధిక రుసుములు వసూలు చేయకుండా అందరికీ అందుబాటు ధరల్లో నెలకి కేవలం రూ 250 చెల్లించి స్థానిక యువత వి.ఎం.సి జిమ్ ను సద్వినియోగం చేసుకోవాలని అడ్డూరి శ్రీరామ్ కోరారు. ఈకార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు అవ్వారు బుల్లబ్బాయి, నున్న కృష్ణ, పల్లెపోగు ప్రసాద్, వసంత, గాయత్రి,జిమ్ కోచ్ అప్సర్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం నిర్వహణ



**తిరుపతి, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి... యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుం దని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర- 2025 శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డి ఎఫ్ ఓ వివేక్, యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం లో నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని అన్నారు. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొంచామని అన్నారు. ఈ నెల 21 న మహిళా వర్సిటీలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించామని, అప్పటి నుండి ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగా పై అవగాహన వచ్చేలా రానున్న రోజుల్లో మన జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత, విశిష్టత కలిగిన 5 ప్రదేశాల్లో భాగంగా నేడు ఎస్.వి జూ పార్క్ నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. తిరుమల, శ్రీహరి కోట, చంద్రగిరి కోట, శ్రీకాళహస్తి, యోగా పై పలు అవగాన కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని అన్నారు.యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరు ఇంకో నలుగురికి యోగ చేయడం వల్ల ప్రయోజనాలను వివరించి వారి చేత కూడా యోగాను చేయించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్ లను ఏర్పాటు చేశామని వారు ఒక్కొక్కరు 200 మందికి ట్రైనింగ్ ఇచ్చి ప్రతి మండలంలో, గ్రామంలోని ప్రతి పౌరుడికి యోగా పై అవగాహన కలిగేలా చూస్తున్నామని. సుమారు జిల్లాలో 10 లక్షల మంది యోగా లో ప్రావీణ్యం పొందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ పట్టణంలో గౌ.ప్రధానమంత్రి హాజరు కానున్న కార్యక్రమానికి కూడా జిల్లా నుండి యోగా లో శిక్షణ తీసుకున్న వారిని పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగ పై అవగాహన కలిగేలా అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతట చేపడుతామని తెలిపారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 21న విశాఖపట్నం లో సుమారు ఐదు లక్షల మంది తో యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. మునిసిపల్, మండల, గ్రామ స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రామ్మోహన్, సాంఘిక సంక్షేమ సాధికారతాధికారి మరియు నోడల్ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, టూరిజం శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, స్థానిక ప్రజలు,యువత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## సుజనా చౌదరి కోలుకుంటున్నారు

### ఇస్కాన్ లివిజయవాడ ప్రెసిడెంట్ చక్రధరి దాస్



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ( సుజనా చౌదరి) కోలుకుంటున్నారని ఆయన ఆరోగ్యం కుదుటపడుతుందని ఇస్కాన్ విజయవాడ ప్రెసిడెంట్ చక్రధరి దాస్ అన్నారు. ఇటీవల సుజనా చౌదరి లండన్ లో జరిగిన ఓ ప్రమాదంలో గాయపడగా శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ లోనీ తమ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇస్కాన్ విజయవాడ ప్రెసిడెంట్ చక్రధరి దాస్ హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు నిరంతరం ప్రజాక్షేమాన్ని కాంక్షించే సుజనా చౌదరి కృష్ణుని చల్లని దీవెనలతో కోలుకున్నారని త్వరలో ప్రజాసేవలో నిమగ్నమవుతారని చక్రధరి దాస్ ప్రభుజి తెలిపారు. ఆయన వెంట వ్రజదాం దాస్ ప్రభుజి ఉన్నారు.

## అన్నదాన పథకానికి రూ 1 లక్షా 116 లు అందజేత



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** 'శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్లదేవస్థానం,ఇంద్రకీలాద్రిపై నిత్య అన్నప్రసాద పథకముకు విరాళం గురువారం అందజేశారు. శ్రీ దుర్గామల్లేశ్వరుల సన్నిధిలో అన్న ప్రసాదం వితరణ నిమిత్తం చిట్టినగర్, విజయవాడ నగరం కు చెందిన బి. పూర్ణ చంద్ర రావు కుటుంబసభ్యులతో కలిసి 1లక్ష 116 రూపాయలు చెక్కు రూపములో అన్నదానం నిమిత్తం విరాళం గా అందించారు. ఈ సందర్భంగా దాతకు, కుటుంబీకులకు శ్రీ అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

## మహానాడు బహిరంగ సభ విజయవంతం

### మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి



**సంగం మే 29 (వార్తాప్రభ ప్రతినిధి)** కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి సంగం మండలం నుండి 50 బస్సులు బయల్దేరి వందలాదిమంది తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేశారని సంఘం మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ మహానాడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ అనర్గళంగా మాట్లాడారని ఈ కూటమి ప్రభుత్వం 20 సంవత్సరాలు పదిలంగా ఉంటుందని త్వరలోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని రాష్ట్రం సస్య శ్యామలంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంగం మండల టిడిపి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీబెజవాడ కనకదుర్గమ్మ వారికి నృత్య కళార్చన







**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై గురువారం సాయంత్రంజగన్మాతకు నృత్య కళార్చన నిర్వహించారు. సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు గానూ సకల కళలకు ఆరాధ్యదేవతయైన ఆది పరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారి సన్నిధిలో నూతన రాజగోపురం ప్రాంగణంలో గురువారం సాయంత్రం 6.30 నుండి కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఢిల్లీ కీ చెందిన శ్రీ ధృయీ నృత్య కళానిలయం విద్యార్థులు భక్తి శ్రద్దలతో శ్రీ కనకదుర్గ అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యా చార్య శ్రీ అయ్యనా ముఖర్జీ ఆధ్వర్యంలో,స్నిగ్ధ, వెనషిక నృత్య విద్యార్థులు తమ ప్రదర్శనలో భాగంగా పలు భక్తి కీర్తనలకు 5మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన అనంతరం కళా బృందానికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి,ప్రసాదములు అందజేశారు.

# సింగరేణి వైద్యులూ.. మీ సామర్థ్యం నిరూపించుకోండి

● చిన్నచిన్న వ్యాధులకు మన వద్దే వైద్యం చేయండి ● సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల వ్యయం ● అయినా సరే అన్ని కేసులను రిఫరల్ కి పంపితే ఇక మన నైపుణ్యత ఏమిటి? ● సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించండి ● కోవిడ్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి ● అన్ని ఏరియాల వైద్యాధికారుల సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్



**హైదరాబాద్, మే, 29:(వార్తా ప్రభ)**సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదు అని సింగరేణి వైద్య శాఖ పై ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు.

చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. ఆసుపత్రులను ఆధునికీకరిస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలచుకోవాలని సూచించారు.గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు.కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

### తిరుపతి ఎంపీ డా.మద్దిల గురుమూర్తి



**తిరుపతి, మే, 29:(వార్తా ప్రభ) :** రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గత ప్రభుత్వ హయాంలో కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.12.23 కోట్లతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలయిన హీరో హోండా షోరూం వద్ద ఎల్.సి-107, రైల్వే సి.ఆర్.ఎస్ వద్ద ఉన్న ఎల్.సి-109 అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అంగీకారం తెలుపుతూ అప్పట్లోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. విధానపరమైన అనుమతులు పూర్తి కావడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి సోమవారం పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూడాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే లైన్ కి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండటంతో రైల్వే గేట్ల సమీపంలో వాహన చోదకుల ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతమనీ ఆయన అన్నారు. అండర్ బ్రిడ్జిల నిర్మాణంతో తిరుపతి ట్రాఫిక్ సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అందాల రష్మిక.. చీర ఎవరిచ్చారు? పిక్స్ ఎవరు తీశారు?



హీరోయిన్ రష్మిక మందన్న ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ షేర్ చేస్తున్న విషయం తెలిసిందే. రకరకాల ఔట్ ఫిట్స్ లో ఫోటోలు దిగి సందడి చేస్తుంటారు. అటు ట్రెడిషనల్.. ఇటు మోడ్రన్ గా అలరిస్తుంటారు. రీసెంట్ గా ఆనంద్ దేవరకొండ సినిమా లాంచ్ ఈవెంట్ కు పసుపు, ఎరుపు, ఆరెంజ్ కలర్స్ ఉన్న చీరలో అటెండ్ అయ్యారు.ఆ తర్వాత అదే చీరతో దిగిన పిక్స్ ను షేర్ చేశారు రష్మిక. రకరకాల పోజులు ఇచ్చారు. అదే సమయంలో ఆమె ఇచ్చిన క్యాప్షన్ హాట్ టాపిక్ గా మారింది. "ఈ పిక్స్ లో నాకు ఇచ్చినవి, విలువైనవి అన్నీ ఉన్నాయి. ఇష్టమైన 3 రంగుల చీర, అది ఇచ్చిన స్పెషల్ లేడీ, ఫోటో తీసిన వ్యక్తి, ఇష్టమైన ప్లేస్ అన్నీ ఉన్నాయి" అని క్యాప్షన్ ఇచ్చారు.దీంతో ఇంకేముంది.. రష్మిక పిక్స్ తో మరోసారి ఆమె లవ్ మ్యాటర్ పై చర్చ ఊపందుకుంది. ఎందుకంటే విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉన్నారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు ఇద్దరిలో ఎవరూ దానికి అంగీకరించలేదు. ఫ్రెండ్స్ అనే చెబుతుంటారు. అయినా అంతా లవర్స్ అని ఫిక్సయ్యారు.అందుకు అనేక కారణాలు ఉన్నాయి. అదే సమయంలో రీసెంట్ గా రష్మిక.. సోఫాపై కూర్చుని పిక్స్ దిగారు. అదే ప్లేస్ లో ఇప్పటికే విజయ్, రష్మిక, దర్శకుడు పరశురామ్ దిగిన పాత పిక్ వైరల్ గా మారింది. దీంతో రష్మిక.. విజయ్ ఇంట్లోనే పిక్స్ తీసుకున్నారని క్లియర్ గా తెలుస్తోంది. అంతే కాదు ఆయనే తీసి ఉంటారని నెటిజన్లు చెబుతున్నారు.ఆ చీర కూడా విజయ్ మదర్ ఇచ్చి ఉంటారని అనుమానపడుతున్నారు. వారిద్దరూ ప్రేమలో ఉండటం నిజమేనని అంటున్నారు. ఇంకెప్పుడూ చెబుతారని క్వశ్చన్ చేస్తున్నారు. ఇప్పటికే లేటైంది.. చెప్పండి అని అడుగుతున్నారు. మొత్తానికి రష్మిక పోస్ట్ చేసిన పిక్స్ అండ్ క్యాప్షన్ మరోసారి లవ్ కహానీ కోసం మాట్లాడేలా చేశాయని చెప్పాలి.కాగా, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. ఫస్ట్ టైమ్ గీతా గోవిందం మూవీలో నటించారు. అప్పట్లో ఆ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అయింది. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ మూవీ కోసం మరోసారి జతకట్టారు. అలా వారి కాంబినేషన్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. వారంతా రీల్ కపుల్.. రియల్ కపుల్ గా మారాలని కోరుకుంటున్నారు. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## 'రాజాసాబ్' టీజర్ డేట్ ఫిక్సయ్యిందా



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'రాజాసాబ్' అప్ డేట్ విషయంలో ఎదురు చూసి చూసి అభిమానులు కూడా నీరసించిపోయారు. ఏప్రిల్ లో రిలీజ్ అవుతుందన్న చిత్రం రిలీజ్ కాకపోవడంతో? ఆ సినిమా గురించి మళ్లీ పెద్దగా డిస్కషన్ కూడా జరగలేదు. రిలీజ్ అయినప్పుడే చూసుకుందాం అన్న ధోరణిలో అభిమానులంతా సైలెంట్ అయిపోయారు. చివరికి సన్నివేశం రాజుగారు అన్నట్లు 'గేమ్ ఛేంజర్' రిలీజ్ అయినప్పుడే అవుతుందులే అన్నట్లు మారిపోయింది.అప్పటి నుంచి సినిమా గురించి సోషల్ మీడియాలో కథనాలకు ఫుల్ స్టాప్ పడింది. చివరికి ఈ చిత్రం ఈ ఏడాది కూడా రిలీజ్ కాదని వచ్చే ఏడాదే రిలీజ్ అంటూ కొత్త కథనాలు మొదలయ్యాయి. తాజాగా 'రాజాసాబ్' అభిమానులకు ఓ గుడ్ న్యూస్. ఈ సినిమా టీజర్ జూన్ 6న రిలీజ్ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో టీజర్ ఎలా ఉండబోతుంది? అన్న ఆసక్తి అభిమానుల్లో మొదలవ్వడం ఖాయం.మరి ఈ టీజర్ మారుతి ఎలా సిద్ధం చేస్తున్నాడు? అన్నది చూడాలి. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే ప్రభాస్ లుక్...కొన్ని గ్లింప్స్ రిలీజ్ అయ్యాయి. వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. మారుతి కంటెంట్ పై వాటితోనే బజ్ తీసుకొచ్చాడు. కానీ సినిమా డిలే అయ్యే సరికి ఆ బజ్ కూడా తగ్గిపోతుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందా? లేదా? అన్నది కూడా సరైన క్లారిటీ లేదు.మేకర్స్ దీనిపై కూడా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. రిలీజ్ కు కారణం పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమంటూ మరో కారణం కూడా తెరపైకి వస్తుంది. దీంతో ఏది నిజమో? ఏది అబద్దమో అర్ధం కానీ సన్నివేశం ఏర్పడుతుం ది. మరి టీజర్ రిలీజ్ తో నైనా సినిమాకి సంబంధించి పూర్తి అప్డేట్ ఇస్తారా? అన్నది చూడాలి.

## ఈ ఏడాది నిర్జల ఏకాదశి ఎప్పుడు ? ఈ రోజున ఉపవాసం ఉండడం వలన కలిగే ఫలితం ఏమిటంటే..



మనిషి జీవితంలో మంచి చెడులు జాతకంలో గ్రహాలు, రాశులు, నక్షత్రాల సంచారం పై ఆధారపడి ఉంటాయి. అందుకనే జ్యోతిష్య శాస్త్రంలో గ్రహాల సంచారానికి అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చారు. ఒక రాశి నుంచి మరొక రాశిలోకి గ్రహం సంచరించే సమయంలో మొత్తం 12 రాశులపై ప్రభావం చూపిస్తుంది. ప్రస్తుతం నవ గ్రహాల అధినేత సూర్యుడు ప్రస్తుతం వృషభరాశి లో ఉన్నాడు. త్వరలో మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. ఈ సమయంలో కొన్ని రాశులకు అదృష్టం కలిసి వస్తుంది. ఆ రాశులు ఏమిటంటే..ప్రస్తుతం గ్రహాల రాజు సూర్యుడు రోహిణి నక్షత్రంలో ఉన్నాడు. అయితే అతను త్వరలోనే నక్షత్రాన్ని మార్చుకోనున్నాడు. జ్యోతిషశాస్త్రం ప్రకారం జూన్ 8న సూర్యుడు వృషభరాశిలో ఉంటూ మృగశిర నక్షత్రంలోకి ప్రవేశిస్తాడు. ఆదివారమ ఉదయం 7:26 గంటలకు ఈ నక్షత్రంలోకి సూర్యుడు అడుగు పెట్టనున్నాడు. దీని తరువాత, జూన్ 15న సూర్యుడు వృషభ రాశిని వదిలి మిథునరాశిలోకి ప్రవేశిస్తాడు. సూర్యుడు ఆత్మగౌరవం, శక్తి, ఉన్నత స్థానాన్ని సూచించే గ్రహం. సూర్యుడిని ప్రత్యక్ష దైవంగా మాత్రమే కాదు నవ గ్రహాలకు రాజు కూడా. అందుకనే సూర్యుడు సంచారము చేసినప్పుడు కొంతమందికి కెరీర్‌లో గౌరవం, విజయం లభిస్తుంది. అటువంటి పరిస్థితిలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి అడుగు పెట్టినప్పుడు ఏ రాశుల వారికి ప్రయోజనం చేకూరుతుందో తెలుసుకుందాం.సింహ రాశి: సూర్యుడు నక్షత్ర మార్పు కారణంగా.. సింహ రాశి వారి జీవితంలో కొనసాగుతున్న సమస్యలు తొలగిపోతాయి. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ కూడా పూర్తవుతాయి. జీవితంలో మీ భాగస్వామి నుంచి మీకు ప్రేమ లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి గతంలో కంటే బలంగా ఉంటుంది. డబ్బు ఆదా చేసుకునే అవకాశం లభిస్తుంది. నక్షత్ర మార్పు ప్రారంభంలో మీరు శుభవార్త వినే అవకాశం ఉంది. వ్యాపారం కోసం రూపొందించిన అన్ని వ్యూహాలు లాభాలు లాభిస్తాయి. వీరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.తుల రాశి: తుల రాశి వారికి ఆర్థిక లాభం పొందే అవకాశాలు బలంగా ఉంటాయి. వీరి ఆదాయం పెరుగుతుంది. ఈ రాశికి చెందిన వ్యాపారస్తులు తమ వ్యాపార రంగంలో అపారమైన విజయాన్ని పొందుతారు. పూర్వీకుల వ్యాపారం నుంచి కూడా భారీ లాభం పొందవచ్చు. ఈ సమయంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనిని పూర్తి చేయవచ్చు. సంబంధాలలో ప్రేమ , నమ్మకం పెరుగుతాయి. వీరిని ఎప్పటి నుంచో ఇబ్బంది పెట్టే సమస్యలు ఏవైనా ఉంటే.. అవి తీరిపోతాయి. ప్రశాంతంగా ఉంటారు.ధనుస్సు రాశి: ధనుస్సు రాశి వ్యక్తుల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ రాశికి చెందిన వ్యక్తుల వైవాహిక జీవితంలో ఆనందం , శాంతి ఉంటుంది. వ్యాపారంలో మంచి లాభాలు పొందుతారు. వ్యాపారాలలో ఆర్థిక పురోగతి కనిపిస్తుంది. జీవితంలో ఆనందం కలుగుతుంది. వీరు ఉద్యోగాన్ని మారాలని ఆలోచిస్తుంటే.. ఈ సమయం ఖచ్చితంగా శుభప్రదం. కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. వ్యాపారం చేసే వ్యక్తులు ప్రభావవంతమైన వ్యక్తులతో బలమైన సంబంధాలను కలిగి ఉంటారు.

## ఈ ఏడాది జగన్నాథ రథయాత్ర ఎప్పుడు? పురుషోత్తముడు తన సోదర, సోదరితో కలిసి ఎప్పుడు పుర వీధుల్లో దర్శనం ఇవ్వనున్నాడంటే..

దేశ విదేశాల్లో ఉన్న కృష్ణ భక్తులు ఏడాది పాటు ఎదురుచూసే పండగ పూరి జగన్నాథుడి రథయాత్ర. ఒడిశా లో ఉన్న పూరి నగరంలో జరుపుకునే వార్షిక పండుగ. ఈ పండుగ విష్ణువు అవతారమైన జగన్నాథుడికి.. అతని అన్నయ్య బలభద్రుడికి, సోదరి సుభద్రకు అంకితం చేయబడింది. ప్రతి హిందువు తన జీవితంలో ఒక్కసారైనా సరే జగన్నాథుడి రథయాత్రని దర్శించుకోవాలని భావిస్తాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జగన్నాథుని రథయాత్ర ఎప్పుడు ప్రారంభం అవుతుంది? ప్రాముఖ్యత తెలుసుకోండి..సప్తమోక్షపురములలో ఒకటిగా, చార్ ధామ్ లో ప్రధానమైనదిగా చెప్పబడుతున్న పురుషోత్తమ క్షేత్రం ఒడిశాలోని పూరి క్షేత్రంలో ఆషాఢ మాసం శుద్ధ విదియ రోజున సుభద్రా బలభద్రా సుదర్శన సహిత జగన్నాథ స్వామివారి రథయాత్ర అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది ఈ పవిత్ర ప్రయాణం శుక్రవారం, జూన్ 27వ తేదీ 2025 నుంచి ప్రారంభం కానుంది. ఈ రథయాత్ర ఒడిశాకే కాదు దేశ విదేశాల్లో ఉన్న లక్షలాది కృష్ణ భక్తులకు ఒక ముఖ్యమైన మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమం. ప్రతీ సంవత్సరమూ అత్యంత వైభవంగా జరిగే ఈ రథయాత్రలో అత్యద్భుతంగా అలంకరించిన రథంలో దివ్యమూర్తుల విగ్రహాల్ని ప్రతిష్ఠించి నృత్యగానాలతో పురవీథుల్లో ఊరేగిస్తారు. భక్తులు ఆనందపారవశ్యంతో రథయాత్రను తిలకిస్తారువేలాది మంది భక్తులు ఈ రథాలను తాళ్లతో లాగుతారు.జగన్నాథ రథయాత్ర ప్రాముఖ్యత జగన్నాథుని రథయాత్రకు హిందూ మతంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున జగన్నాథుడు తన భక్తులకు దర్శనం ఇవ్వడానికి భారీ రథాలపై నగర పర్యటనకు వెళతాడు. ఈ ప్రయాణంలో జగన్నాథుడు, ఆయన అన్నయ్య బలభద్రుడు, సోదరి సుభద్ర మూడు వేర్వేరు రథాలపై స్వారీ చేస్తూ గుండిచా ఆలయానికి వెళతారు. గుండిచా ఆలయం జగన్నాథుని మేనత్త ఇల్లు అని నమ్ముతారు. జగన్నాథుడు ఇక్కడ కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటాడు. జగన్నాథుని ఈ రథయాత్ర విశ్వాసం, భక్తి, సాంస్కృతిక సంప్రదాయాల అద్భుతమైన సంగమం. ఇది లక్షలాది మంది భక్తులను ఒకచోట చేర్చి, దేవునికి దగ్గరయ్యే అవకాశాన్ని కల్పిస్తుంది.జగన్నాథ రథయాత్రకు సంబంధించిన అనేక మత విశ్వాసాలు.. ఈ రథయాత్రలో పాల్గొనడం ద్వారా లేదా దేవుని రథాన్ని చూడటం ద్వారా.. లేదా రథాన్ని లాగడం ద్వారా మోక్షం లభిస్తుందని, తెలిసి తెలియక చేసిన అన్ని పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు.కోరికల నెరవేరుతాయని నమ్మకం. రథాన్ని లాగడం లేదా రథం వెళ్ళే మార్గాన్ని ఊడ్చడం వల్ల తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు.హిందువుల ఐక్యతకు చిహ్నం ఈ రథయాత్ర ఊరేగింపు సమాజ ఐక్యత, సోదరభావానికి చిహ్నం. దీనిలో అన్ని తరగతులు , కులాల ప్రజలు కలిసి భగవంతుని రథాన్ని లాగుతారు.రథయాత్ర ప్రక్రియ రథయాత్ర కోసం జగన్నాథుడు, బలభద్రుడు ,సుభద్రల కోసం మూడు భారీ రథాలను నిర్మిస్తారు. ఈ రథాలను 'దారు' అని పిలువబడే పవిత్రమైన వేప కలపతో తయారు చేస్తారు. రథాలను ఆకర్షణీయంగా అలంకరిస్తారు. వేలాది మంది భక్తులు ఈ రథాలను తాళ్లతో లాగుతారు.ఈ ప్రయాణం జగన్నాథ ఆలయం నుంచి ప్రారంభమై గుండిచా ఆలయం వరకు వెళుతుంది. ఈ సమయంలో, లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం దారి పొడవునా గుమిగూడతారు.

## మిర్యాలగూడ పట్టణంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్

**నల్గొండ, మే, 29:(వార్తా ప్రభ):** మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్ నగర్ లో పోలీసులు కార్డేన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డి.ఎస్.పి రాజశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు సరైన పత్రాలు లేని పలు వాహనాలు సీజ్ చేసారు.

## బరువు తగ్గాలనుకుంటున్నారా..? అయితే ఇలా చేయండి..!



పాలు, తేనె కలిపి తాగడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. పాలలో ప్రోటీన్, తేనెలో సహజమైన చక్కెర ఉండటంతో ఇది ఆకలి నియంత్రణ చేస్తుంది. తేనెలో ఉన్న యాంటీ-ఆక్సిడెంట్లు కొవ్వును నియంత్రించి, శరీర బరువును తగ్గించేందుకు సహాయపడతాయి. రోజూ తేనె కలిపిన పాలు తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.: బరువు తగ్గాలనుకుంటున్నారా..? అయితే ఇలా చేయండి..!పాలు ఆరోగ్యకరమైనవి పైగా పోషకాలతో కూడా నిండి ఉంటుంది. అందుకే వైద్యులు అందరికీ రోజుకు ఒక కప్పు పాలు తాగాలని సూచిస్తారు. పిల్లల నుండి పెద్దవాళ్ల వరకు అందరికీ పాలు అవసరం. కొందరు సాధారణ పాలు తాగుతారు. మరికొందరు దానికి చక్కెర కలుపుతారు. కొంతమంది పాలలో పసుపు కలిపి తాగుతారు. అదే విధంగా పాలలో తేనె కలిపి తాగేవారు కూడా ఉన్నారు. పాలలో చక్కెరకు బదులుగా తేనె కలపడం ఆరోగ్యానికి మంచిది. దీని వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.పాలు ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. తేనె సహజ చక్కెరను అందించి తీపి పదార్థాల పట్ల ఉన్న ఆసక్తిని తగ్గిస్తుంది.తేనెలో ఉన్న ప్రత్యేక పదార్థాలు మెటాబాలిజాన్ని కొంచెం పెంచగలవని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.చక్కెర ఉన్న డ్రింక్స్ కు బదులుగా పాలు, తేనెను తీసుకోవడం వల్ల మొత్తం కేలరీలు తీసుకోవడం తగ్గుతుంది.మనం ఆరోగ్యంగా ఉండాలంటే మంచి రోగనిరోధక శక్తి ఉండాలి. పాలు, తేనె కలిపి తాగడం వల్ల ఈ శక్తి పెరుగుతుంది. పాలలో ఉన్న ప్రోటీన్, కాల్షియం, తేనెలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల రోగాల నుండి మనల్ని రక్షిస్తాయి.ప్రస్తుత రోజుల్లో బరువు పెరగడం చాలా మందికి సమస్యగా మారింది. దీన్ని తగ్గించడానికి చాలా మంది వివిధ మార్గాలు ప్రయత్నిస్తున్నారు. పాలు, తేనెను కలిపి తాగడం వల్ల కొవ్వు కరగడంలో సహాయపడుతుంది. కొద్ది రోజుల్లోనే బరువు తగ్గినట్లు అనిపిస్తుంది. తేనెలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి.ప్రస్తుత జీవన విధానంలో పలు కారణాల వల్ల చాలా మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మీరు ఒత్తిడిలో ఉంటే పాలు, తేనె మంచి సహజ ఔషధంగా పనిచేస్తాయి. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పైగా మనసుకు ప్రశాంతత లభిస్తుంది. పాలలో ఉన్న కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. తేనె నరాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మీకు శ్వాస సంబంధిత సమస్యలు ఉంటే. పాలు, తేనె కలిపి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఇది దగ్గు, శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.చర్మం మసకబారితే పాలు, తేనెను కలిపి తాగడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి సహజమైన కాంతిని అందిస్తుంది.ఇలా పాలు, తేనెను కలిపి తాగడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బరువు తగ్గడం, రోగనిరోధక శక్తి పెరగడం, మానసిక ఒత్తిడి తగ్గడం వంటి లాభాలు లభిస్తాయి. కాబట్టి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ప్రతిరోజూ పాలలో తేనె కలిపి తాగండి.

## ఘనంగా కొనకళ్ళ సీతయ్య పుట్టినరోజు వేడుకలు



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** మంగళవారం కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య 71వ పుట్టినరోజు వేడుకలు పామర్రు వద్ద గల వాసవీ వృద్ధ శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వృద్ధుల మధ్య కేకు కటింగ్ చేసి వేడుకల మధ్య మహిళలకు చీరలు అలాగే పురుషులకు లుంగీ టవల్స్ మామిడిపళ్ళు, భోజనం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘము అధ్యక్షులు సన్నిధి నాగ సాయి విచ్చేశారు. కొనకళ్ళ వెంకట నాగలక్ష్మి, మాజేటి లక్ష్మి, వల్లికాంబ మానేపల్లి రఘురాముడు, ఘంటసాల భరతుడు, పోకూరి మోహన్ రావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, బొగ్గరపు తిరుపతయ్య, కె. సాయి బాజేశ్వరరావు, టి సుబ్బారావు, ఉమా శంకర్, నాగరాజు, చందు, పండు, కిరణ్, డి చిన్న జవ్వాజి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంపై అవగాహన



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** పుస్తక పఠనంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని విశ్రాంత ఉపాధ్యాయులు యలవర్తి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శాఖా గ్రంథాలయం రాజేంద్రనగర్ నందు సమ్మర్ క్యాంపు లో భాగంగా పిల్లలతో కథలు చదివించడం, క్యారమ్స్, లూడో, అలాగే పిల్లలతో చెస్ ఆడించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. శాంతి తదితరులు పాల్గొన్నారు.

## యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాకారమవుతుందని ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 27న స్థానిక కైకాల కళా పురపాలక సంఘ మందిరం నందు ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు 31 వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గుడివాడ నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు యోగాను దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ ఐన గంగాధరపురం జిల్లా పరిషత్ హైస్కూలు పి.టి ఎం జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు బి. హరికృష్ణ, బి. కోటయ్య మరియు ఇతర పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరాటంకంగా గుడివాడ వాకర్స్ ఉచిత మజ్జిగ పంపిణీ..



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11గం॥కు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం దగ్గర పల్లపోతు హరికృష్ణ గారి దంపతులచే ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డి వి సత్యనారాయణ, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి ట్రెజరర్ చలవాదిమోహన్ రావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ చిన్నం గంగాధర్, పి ఆర్ ఓ మహంకాళి వీర శేఖర్, మాజీ ఏవిపి బొగ్గవరపు తిరుపతయ్య, గంటా చంద్రశేఖర్, అంగడాల సతీష్, పామర్తి కేశవరావు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమంలో జయప్రదం చేశారు.

## వేసవి శిక్షణ తరగతులు



**తిరువూరు,మే 29 (వార్తాప్రభ) :** ప్రథమశ్రేణి గ్రంథాలయం నందు లైబ్రరియన్ పద్మావతిఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమాలు 1.విద్యార్థులతో పుస్తకాలు చదివించి వారు చదివిన పుస్తకం లోని కథలు వారితో చెప్పించడమైనది. 2.గ్రంథపాలకురాలు G K ప్రశ్నలు అడిగి విద్యార్థులతో సమాధానాలు చెప్పించడమైనది. 3.ఇంగ్లీష్ గ్రామర్ టెస్ట్ నిర్వహించడమైనది. 4.విద్యార్థుల తో మెడిటేషన్,యోగా చేయించడమైనది. 5.సబ్ జూనియర్స్ -జూనియర్స్ తో తెలుగు అక్షరాలు బోర్డు పై వ్రాయించడమైనది.

# సురవరం ప్రతాపరెడ్డి జయంతి అధికారికంగా నిర్వహణకు కృషి చేస్తా

● సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సురవరం ప్రతాపరెడ్డి

● రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్,మే 29 (వార్తాప్రభ) :** సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సామాజికవేత్త, కవి, రచయిత, ప్రముఖ సంపాదకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషా కోవిదులు, గ్రంథాలయాల అభివృద్ధికి తపించిన సురవరం ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి దశాబ్దం క్రితమే తెలంగాణ గళం గట్టిగా వినిపించారని, అన్ని సామాజిక వర్గాలలో చైతన్యాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.అంతటి మహనీయుని పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని చిన్నారెడ్డి తెలిపారు. సురవరం గొప్ప పరిశోధకులు అని, సొంతంగా 11 వేల పుస్తకాలు సేకరించి భావి తరాల కోసం రెడ్డి హాస్టల్ లైబ్రరీలో భద్ర పర్చారని చిన్నారెడ్డి అన్నారు.ఈ



కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానంద రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, ప్రముఖ సాహితీ విమర్శకులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఏనుగు నర్సింహా రెడ్డి, సురవరం కృష్ణ వర్ధన్ రెడ్డి, నిర్వాహకులు బడే సాబ్, మనోహర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సరోజినీ దేవి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను చిన్నారెడ్డి ఆవిష్కరించారు.

# ఇలాంటి వాటికి మద్దతు ఇస్తున్న గ్రామ కార్యదర్శి ఎవరు?

● తూరంగి లో అక్రమాలు జరుగుతున్న పట్టించుకోని రూరల్ ఎమ్మెల్యే




**కాకినాడ రూరల్,మే 29 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ 12వ తేదీని తూరంగిలో నకిలీ ఇంటి పనుల విషయమై జిల్లా కలెక్టర్ కి మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయగా దీనిపై కాకినాడ రూరల్ డిప్యూటీ ఎండిఓ శ్రీరామ్ 27వ తేదీన తూరంగి గ్రామపంచాయతీలో ఎంక్వైరీ చేయడం జరిగింది. గ్రామపంచాయతీలో 2021 సంవత్సరం నుండి కూడా గతంలో తూరంగి గ్రామపంచాయతీలో పనిచేసిన కార్యదర్శుల సంతకాలతో ఇంటి పన్ను బిల్లులు రావడం కోసమెరుపు. మరి దీనిపై ఎంక్వయిరీ చేసిన అధికారి ఏ చర్యలు తీసుకుంటారు ఎదురు చూడాలి మరియు గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబరు ఒకచోట డోర్ నెంబరు ఒకచోట బిల్డింగు మరియొక చోట ఉండటం గమనార్హం గ్రామపంచాయతీలో నకిలీ వీఆర్వోల సంతకాలతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఒకవేళ హౌసింగ్ లోన్ కూడా అప్లై చేస్తున్నారా అనే విషయం పై కూడా ఎంక్వయిరీ చేస్తే అసలు తూరంగి గ్రామ లో ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడా లేని విధంగా నకిలీలు ఇక్కడే జరుగుతున్నాయంటే దీనికి ఏ అధికారులు అండదండలు ఉన్నాయి? ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పూర్తిగా ఎంక్వయిరీ చేస్తే అసలు దోషులు బయటికి వస్తారు. అసలు ఎంక్వయిరీ చేస్తారా లేదా గొప్పలు చెప్పుకునే పంచాయతీరాజ్ శాఖలో ఇంత అవినీతి కి పాల్పడుతుంటే జిల్లా పంచాయతీ అధికారి ఎందుకు స్పందిస్తా లేదు?

# ప్రజలకు మంచి చేయడమే ధ్యేయంగా ఎమ్మెల్యే రాము నిరంతర కృషి.. టిడిపి నాయకులు

● బాధిత కుటుంబానికి రూ. 80వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాలు అందించిన గుడివాడ టిడిపి నేతలు

**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** గుడివాడ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సుకు సమ ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముందుకు సాగుతున్నారని గుడివాడ టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి లు తెలియజేశారు. స్థానిక ఏలూరు రోడ్ లోని టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక) లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో.. రూరల్ మండలం చిన ఎరుకపాడు గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 80వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్.ఓ.సి పత్రాలను బాధిత కుటుంబ సభ్యురాలు పామర్తి నాగజ్యోతికు గురువారం టిడిపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ గుడివాడను ప్రగతి పథంలో తీసుకెళ్లడంతో పాటుగా ప్రజలకు మంచి చేయడానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిరంతరం కష్టపడుతున్నారన్నారు. పనిచేసే నాయకుడు ఉంటే ప్రజలకు ఎంత మంచి జరుగుతుందో ఎమ్మెల్యే రాము ప్రత్యక్షంగా చూపిస్తున్నారన్నారు. ప్రజావేదిక కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ అందుబాటులో ఉందని



నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, అంగలూరు చిట్టిబాబు, మెరుగుమాల బ్రహ్మయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంస పాలనతో అన్నపూర్ణను అప్పులప్రదేశ్ గా మార్చేశారు!

(మొదటి పేజీ తరువాయి)

జెండా పీకేస్తాం అన్నారు ... పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు. పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు ... ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు... ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు... ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**దేవుని గడప సాక్షిగా ప్రజలకు 4ప్రశ్నలు..** దేవునికడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా. 1). తల్లిని చెల్లిన మెడబట్టి బయటకు గెంటిదెవరు? 2). సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3). జె-బ్రాండ్స్ తో పేదల రక్తం తాగిందెవరు? 4). బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

**ఆరుశాసనాలే మన శ్వాస!..** సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళు అన్నారు అన్న ఎన్టీఆర్. అందుకే మనం ఆరుశాసనాలు తీసుకున్నాం. కడప మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించిన ఆరుశాసనాలను పొలిట్ బ్యూరో సభ్యుడి నుంచి సామాన్య కార్యకర్త వరకు శ్వాసగా భావించి చిత్తశుద్ధితో అమలుకు కృషిచేయాలి. 1). తెలుగుజాతి - విశ్వఖ్యాతి, పేదలసేవలో %-% రీఇంజనీరింగ్, స్త్రీశక్తి,, యువగళం, అన్నదాతకు అండగ, కార్యకర్తే అధినేత. మనకు రాష్ట్రప్రజలు, ప్రజల ముఖాల్లో చిరునవ్వు, వారి సంతోషమే ముఖ్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడి ప్రజల మనసు గెలుద్దాం. సమస్యలుంటే ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకోవాలి. స్థానికంగా సాధ్యం కాకపోతే మా దృష్టికి తీసుకువస్తే మేమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. రాజమండ్రి జైలులో చంద్రబాబును చూసినపుడు చాలా బాధేసింది. అలిపిరిలో ఆయనను చంపేందుకు బాబు పేల్చారు. ప్రజలకు అండగా నిలచేందుకు భగవంతుడు ఆయనను ఈనాడు మన ముందుంచారు.

**సిబిఎన్ అంటే ఒక బ్రాండ్..** తెలుగు వారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సిబిఎన్. అప్పుడు ఐటీ ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్ ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సిబిఎన్...ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది మన సిబిఎన్. అన్న క్యాంటిన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సిబిఎన్. సిబిఎన్ అంటే డెవెలప్మెంట్, సిబిఎన్ అంటే సంక్షేమం, సిబిఎన్ అంటే మానవత్వం. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు.

**దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్..** పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి రావడం ఒక చరిత్ర. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. రూ.2 కే కిలో బియ్యం, పెన్షన్, రూ.50 కే హార్స్ పవర్ విద్యుత్, జనతా వస్త్రాలు, పక్కా ఇల్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్ పట్వారి విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు. అభివృద్ధి అయినా, సంక్షేమం అయినా ఎన్టీఆర్ ఒక బ్రాండ్. తెలుగువారి ఆత్మగౌరవం విశ్వ విఖ్యాత, నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు.

**రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే కూటమి ఏర్పాటు..** రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కూటమి ఏర్పడింది. ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోదీ గారు, జనసేన అధినేత పవనన్న, మన చంద్రన్న జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి కలిసి పనిచేసారు. ప్రజలు కూటమిని ఆశీంర్వదించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నాం. పూర్తిగా బెడ్ కే పరిమితం అయిన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. నేను ఈ వేదిక మీద నుండి వైసిపి వాళ్ళను ప్రశ్నిస్తున్నా వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి మీకు ఎన్ని ఏళ్ళు పట్టింది? 5 ఏళ్ళు పట్టింది.

# నేడు గంగాధర రీజియన్ మీట్

**వేదిక : ఉపద్రష్ట ఫంక్షన్ హాల్, సత్యనారాయణపురం..**

**సమయం : సాయంత్రం 5.30 ని॥లకు**



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316 డి పర్యవేక్షణలో గంగాధర రీజియను మీట్ను ఈనెల 30వ తేది శుక్రవారం సాయంత్రం 5.30ని॥లకు స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు రీజియన్ ఛైర్పర్సన్ ఉపద్రష్ట రాంబాబు, రీజియన్ ఫస్ట్ లేడీ యు.లక్ష్మీకామేశ్వరిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పోస్టు కమిటీ గౌరవసలహాదారు మూల్పూరి ఉపేంద్ర హాజరవుతారన్నారు. గౌరవ ఛైర్పర్సన్స్ ఎఆర్కె చౌదరి, వైసిపి ప్రసాద్, ప్రోగ్రాం కమిటీ ఛైర్పర్సన్స్ డా॥ వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర, గౌరవ అతిథులుగా శాసనసభ్యులు వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటా రన్నారు. గంగాధర మీట్లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 లయన్స్ క్లబ్ సభ్యులు, జిల్లా నేతలు తదితరులు



పాల్గొంటారని నిర్వాహకులు తెలిజే శారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక లయన్స్ క్లబ్ నేతలు విజ్ఞప్తి చేశారు.

## జై శ్రీనాట్యమండలి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు..

-కళాకారులను సత్కరించిన కూటమి పార్టీల నాయకులు..



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :**గుడివాడ పట్టణం బేతవోలు లోని శ్రీ ఆనందశ్వరస్వామి దేవస్థాన కళా వేదికపై ఆంధ్రప్రదేశ్ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జై శ్రీ నాట్యమండలి నిర్వాహకులు జిల్లా సాంస్కృతిక ఉపాధ్యక్షుడు కొడాలి రాజా బృందంచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా కళావేదికపై నిర్వహించిన దుర్యోధన మయసభ స్కిట్, శ్రీకృష్ణార్జున పాత్రలు, హరిశ్చంద్ర పాత్రల అభినయ ప్రదర్శనలు కళాభిమానులను అలంరింప చేశాయి. అత్యద్భుత ప్రదర్శనలు చేసిన కళాకారులను కూటమి నాయకులు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ భాషా సంస్కృతిక శాఖ సహకారంతో కళాకారుల ప్రోత్సాహక కార్యక్రమాలలో భాగంగా ఈ ప్రదర్శనలు నిర్వహించినట్లు కొడాలి రాజా తెలియజేశారు. ఈ ప్రదర్శన కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలాసి ఉమా, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారథిబాబు, స్థానిక పెద్దలు పెన్నెరు విశ్వనాథ్, బోక్కా నాగరాజా, బెల్లం కొండ, నాగేశ్వరావు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

## వృధా ఖర్చులకు పోకుండ సేవ చేయడం అభినందనీయం



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** గురువారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కలవలపల్లి గ్రామ వాస్తవ్యులు జొన్న రమేష్ గారు వారి సతీమణి లక్ష్మి గార్ల పెళ్లిరోజు సందర్భంగా జి 3 సింధూర థియేటర్ వెనక రోడ్ లోవున్న కర్ల వృద్ధాశ్రమంలో వున్న వృద్ధులకు అన్నదానం మరియు నిత్యవసర వస్తువులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటరమణ గారు విచ్చేసి అన్నదాన కార్యక్రమం మరియు నిత్యవసర వస్తువులు వారికి అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో భాగంగా పెళ్లిరోజులు పుట్టినరోజులు జరుపుకునే వారు ఆడంబరాలకి వృధా ఖర్చులకు పోకుండా వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేస్తే పదిమందికి ఉపయోగపడే వారు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖుడు బొగ్గరపు తిరుపతయ్య, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు జాజుల మునీంద్ర, కంతేటి హరిబాబు, జాజుల తాతారావు, కర్ల వృద్ధాశ్రమ నిర్వాహకులు కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చలువాది దంపతులకు వాకర్స్ సభ్యుల అభినందనలు



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ట్రెజరర్ చలువాది వెంకట మోహన్ రావు పెళ్లి రోజు సందర్భంగా స్థానిక వాసవి చౌక్ నందు గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ముఖద్వారం దగ్గర ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మోహన్ రావు ఇంటికి వెళ్ళి ఆ దంపతులకు పండ్లు, పుష్పగుచ్ఛం, శాలువా బహుమతులు మెమెంటోలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డి.వి. సత్యనారాయణ, సెక్రటరీ ఎం. లక్ష్మీనారాయణ రెడ్డి, పామర్తి కేశవ, చిన్నం గంగాధర రావు, ఎం. వీరశేఖర్, గంటా చంద్రశేఖర్, పోకూరి మోహన్ రావు, దండమూడి సీతారామస్వామి, బొగ్గవరపు తిరుపతయ్య వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తారకరామునికి ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ నివాళి



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం అన్న నందమూరి తారకరామారావు 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక స్టేడియం వద్ద అన్న తారకరామారావు కాంస్య విగ్రహానికి ఎన్టీఆర్ వాకర్స్ సభ్యులు, నేతలు ఘనంగా నివాళులర్పించారు.

**మరడాని దంపతులకు ఎన్టీఆర్ వాకర్స్ శుభాకాంక్షలు :** బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఎన్టీఆర్ వాకర్స్ సీనియర్ నేత మరడాని వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మరడాని వెంకటరమణ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, మున్నలూరి రామకృష్ణ, పి. సత్యనారాయణ, వంగపండు బ్రహ్మాజీ, అర్జా ప్రసాద్, చింతలూరి సత్యనారాయణ, ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ నేతలు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

